PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 150 | 11 శుక్రవారం సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari




# సీసీఎల్ఏలో స్ట్రక్చర్డ్ ల్యాండ్ బ్యాంక్ పోర్టల్

**అమరావతి, సెప్టెంబరు 10 (ప్రజా సీమ):**

రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉన్న భూములకు సంబంధించి స్ట్రక్చర్డ్ ల్యాండ్ బ్యాంక్ పోర్టల్‌ను తయారు చేయాలని రెవెన్యూ శాఖను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. 8వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో యాక్షన్ టేకెన్ రిపోర్టులపై చర్చ సందర్భంగా వేర్వేరు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉండిపోతున్న భూముల్ని గుర్తించి వాటి వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని సీఎం స్పష్టం చేశారు. రీసర్వే పూర్తయ్యాక ప్రభుత్వ భూములపై పూర్తి స్పష్టత వస్తుందని సీఎం అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల వద్ద ఏళ్లుగా వినియోగం లేని భూముల్ని గుర్తించాలన్నారు. వాటి వివరాలను కామన్ ల్యాండ్ బ్యాంక్ పోర్టల్ కిందకు తీసుకు రావాలన్నారు. జిల్లాలు, శాఖల వారీగా ప్రభుత్వ భూముల వివరాలను నమోదు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఏ ప్రభుత్వ శాఖకు భూమి అవసరమైనా ఈ పోర్టల్ ద్వారా కేటాయించే పరిస్థితి ఉండాలని అన్నారు. భూమి కొరత అభివృద్ధికి అడ్డంకి కాకూడదని సీఎం స్పష్టం చేశారు. ప్రాజెక్టు మంజూరు అయిన తర్వాత భూమి కోసం వెతకకుండా ముందుగానే పారిశ్రామిక, అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూమిని గుర్తించాలని సూచించారు. ...మిగతా 2 లో...

- ఎస్సీలకు కలిగే ప్రయోజనాలను బుడగ జంగాలకూ వర్తింప చేయండి
- ప్రణాళిక ప్రకారం కలెక్టర్లు అభివృద్ది కార్యక్రమాలు చేపట్టాలి
- కలెక్టర్ల సదస్సులో యాక్షన్ టేకెన్ రిపోర్టుపై సీఎం చంద్రబాబు ఆదేశాలు

## డీకే శివకుమార్ పాలనకు 100 రోజులు.. సిద్ధరామయ్య ఏమన్నారంటే...!

- ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రభుత్వం సరైన దిశలోనే వెళుతోందన్న సిద్ధరామయ్య
- 100 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సీఎం, కేబినెట్‌కు అభినందనలు
- ఏడాదికి రూ.52,000 కోట్లతో ఐదు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని వెల్లడి
- బీజేపీ బళ్లారి పాదయాత్రను ఒక రాజకీయ జిమ్మిక్కుగా అభివర్ణన
- కరువు సాయం కోసం కేంద్రంపై ఆధారపడొద్దని ప్రభుత్వానికి సూచన



కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం సరైన దిశలోనే పయనిస్తోందని మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. ...మిగతా 2 లో...

## తమిళనాడులో రాష్ట్ర పార్టీగా టీవీకే.. విజయ్ పార్టీకి ఈసీ అధికారిక గుర్తింపు...

- తమిళగ వెట్రి కళగంకు రాష్ట్ర పార్టీ హోదా కల్పించిన ఈసీ
- విజయ్ పార్టీకి శాశ్వత గుర్తుగా 'విజిల్' కేటాయింపు
- 2026 అసెంబ్లీ ఎన్నికల్లో 108 సీట్లు గెలిచిన టీవీకే
- తొలి ఎన్నికల్లోనే 34.92 శాతం ఓట్లు సాధించిన పార్టీ
- తమిళనాడులో ఏడో రాష్ట్ర పార్టీగా అవతరించిన టీవీకే



ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీకి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) రాష్ట్ర పార్టీగా అధికారిక గుర్తింపునిచ్చింది. పార్టీకి శాశ్వత ఎన్నికల గుర్తుగా 'విజిల్'ను కేటాయిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే కనబరిచిన అద్భుత పనితీరు ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. ...మిగతా 2 లో...

## 28 లక్షల ఎకరాలు 22-ఏ జాబితా నుండి తొలగింపు

- కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో మంత్రి అనగాని సత్యప్రసాద్

**అమరావతి, సెప్టెంబరు 10 (ప్రజా సీమ):**

రాష్ట్రంలో శతాబ్దాల కాలంగా కొనసాగుతున్న భూసమస్యలకు చరమ గీతం పాడుతూ, భూయజమానులకు వారి ఆస్తులపై సంపూర్ణ హక్కులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ..





## స్వచ్ఛతాన్ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి లోకేష్

- అక్టోబర్ 2న విజయవాడలో భారీస్థాయిలో నిర్వహణ

**అమరావతి, సెప్టెంబర్ 10 (ప్రజా సీమ):**

స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న విజయవాడలో భారీ స్థాయిలో నిర్వహించే స్వచ్ఛతాన్ పోస్టర్ ని మానవ వనరుల అభివృద్ధి, విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం రాత్రి గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి పరిధిలోని కరకట్ట పక్కన గల తమ నివాసంలో ఆవిష్కరించారు. స్వచ్ఛతా రన్‌లో పాల్గొనేవారు తమ పేర్లను రిజిస్టర్ చేసుకునేందుకు అమరావతిరన్నర్స్.కామ్ పోర్టల్‌ని కూడా మంత్రి లాంచ్ చేశారు. ...మిగతా 2 లో...

## చిన్నారుల కోసం 21 కొత్త పోషకాహార కేంద్రాలు

- అందుబాటులోనికి రానున్న 175 పడకలు
- రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**అమరావతి,సెప్టెంబరు 10 (ప్రజా సీమ):**



రాష్ట్రంలో తీవ్ర పోషకాహార లోపంతో బాధపడు తున్న చిన్నారులకు వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి. కొత్తగా 21 పోషకాహార పునరావాస కేంద్రాలు (ఎన్ఆర్సీలు) ఏర్పాటు కాబోతున్నాయి. వీటి ద్వారా 175 పడకలు అదనంగా అందు బాటులోకి రానున్నాయి. ఇందులో ఎనిమిది 10 పడకల ఎన్ఆర్సీలు, ఏడు 5 పడకల ఇంటిగ్రేటెడ్ ఎన్ఆర్సీలు, మరో ఆరు 10 పడకల కొత్త కేంద్రాలు దశలవారీగా వినియోగంలోకి రానున్నాయి. ...మిగతా 2 లో...

## నారా లోకేశ్ అడ్డంగా దొరికిపోయారు: అంబటి రాంబాబు

- డీఎస్సీ, ఏపీపీఎస్సీ పరీక్షల్లో భారీగా అక్రమాలు జరిగాయన్న అంబటి
- చంద్రబాబు, లోకేశ్ మౌనంగా ఉన్నారని మండిపాటు
- ఉద్యోగాలను లోకేశ్ బఠానీలు అమ్మినట్లు అమ్మేశారని విమర్శ



ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన డీఎస్సీ, ఏపీపీఎస్సీ పరీక్షల్లో ఎన్నడూ లేనంత స్థాయిలో భారీ అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని... విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ ఈ కుంభకోణంలో అడ్డంగా దొరికిపో యారని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. డీఎస్సీ అక్రమాలపై ప్రభుత్వం మౌనం వహిస్తోందని... లోకేశ్ కు మంత్రి పదవిలో కొనసాగే అర్హత, హక్కు రెండూ లేవని మండిపడ్డారు.

## క్లస్టర్ స్థాయిలో విద్యార్థులకు స్వచ్ఛతా పఖ్వాడా పోటీలు.

**రాజంపేట (ప్రజా సీమ):**

కడప జిల్లా కొత్త బోయినపల్లి పీఎం శ్రీ ఎస్.జె. ఎస్.ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు కే.భారతి ఆధ్వర్యం లో స్వచ్ఛతా పఖ్వాడా పరిశుభ్రత మరియు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించే విధంగా స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో 15 రోజుల జాతీయ ప్రచార కార్యక్రమం గురు వారం నిర్వహించారు. క్లస్టర్ స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇసుక పల్లె,తాళ్ళపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొనగా వ్యాస రచన, డ్రాయింగ్, మోడల్ మేకింగ్ కాంపిటీషన్ నిర్వహించారు.ఈ నెల 15 వ తేదీ జరిగే ముగింపు కార్యక్రమ సభలో విజేతలైన బాల బాలికలకు బహుమతి ప్రధానం చేయనున్నారు.



# ప్రియాంక గాంధీ ఫేక్ వీడియోలు.. వాటిలో పెట్టుబడులు పెట్టొద్దంటూ ఆఫీస్ హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా పేరుతో సామాజిక మాధ్యమాల్లో కొన్ని నకిలీ వీడియోలు విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. ఈ పరిణామంపై ఆమె కార్యాలయం తీవ్రంగా స్పందిస్తూ ప్రజలకు హెచ్చరిక జారీ చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించిన ఈ వీడియోలను చూసి మోసపోవద్దని స్పష్టం చేసింది. కొన్ని సంస్థలు, పథకాలలో పెట్టుబడులు పెట్టాలని ప్రియాంక గాంధీ స్వయంగా ప్రోత్సహిస్తున్నట్లుగా ఈ నకిలీ వీడియోలను రూపొందించారు. ఇందుకోసం ఆమె ఛాయాచిత్రాలతో పాటు, ఏఐ ద్వారా ఆమె గొంతును (వాయిస్ క్లోనింగ్) అనుకరించారు. ఇవి అచ్చం ఆమె గొంతులాగే ఉండటంతో ప్రజలు నిజమని నమ్మే ప్రమాదం ఉందని ఆమె కార్యాలయం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వీడియోలు పూర్తిగా నకిలీవని, మోసపూరితమైనవని ప్రియాంక గాంధీ కార్యాలయం గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. వీటిని నమ్మి ఎవరూ నగదు పెట్టుబడులు పెట్టవద్దని విజ్ఞప్తి చేసింది. అలాగే, ఇటువంటి వీడియోలతో పాటు వచ్చే అనుమానాస్పద లింకులను అస్సలు క్లిక్ చేయవద్దని హెచ్చరించింది. సామాజిక మాధ్యమాల్లో ఇటువంటి పోస్టులు కనిపిస్తే వెంటనే వాటిని రిపోర్ట్ చేసి, ఆ ఖాతాలను బ్లాక్ చేయాలని ప్రజలకు సూచించింది. డీప్‌ఫేక్ సాంకేతికతను అడ్డుపెట్టుకుని ప్రముఖుల పేర్లతో సాగుతున్న ఆర్థిక మోసాల నుంచి ప్రజలను కాపాడేందుకే ఈ హెచ్చరిక జారీ చేసినట్లు వెల్లడించింది.

# డీకే శివకుమార్ పాలనకు 100 రోజులు.. సిద్ధరామయ్య ఏమన్నారంటే...!

మొదటిపేజీ తరువాయి

శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు, ఆయన మంత్రివర్గానికి సిద్ధరామయ్య అభినందనలు తెలియజేశారు.విధానసౌధలోని బాంక్వెట్ హాల్‌లో గురువారం నిర్వహించిన 'దృఢ కర్ణాటక సంకల్ప – 100 రోజుల విజయవంతమైన ప్రస్థానం' కార్యక్రమంలో సిద్ధరామయ్య ప్రసంగించారు. 100 రోజుల మైలురాయి అనేది కేవలం వేడుకలకు పరిమితం కాకూడదని, ప్రభుత్వం తన పనితీరును ప్రజల ముందు ఉంచి, బాధ్యతలను ఏ మేరకు నెరవేరుస్తోందో నిరూపించుకోవడానికి ఇదొక చక్కని అవకాశమని ఆయన పేర్కొన్నారు. డీకే శివకుమార్ నేతృత్వంలోని సర్కార్ సరైన మార్గంలోనే సాగుతోందని తాను భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదురైనప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీ పథకాలను విజయవంతంగా అమలు చేసిందని సిద్ధరామయ్య గుర్తు చేశారు. ఈ పథకాల కోసం ఏటా సుమారు రూ. 52,000 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఆయన వివరించారు. సామాజిక అసమానతలను తొలగించి, అన్ని వర్గాల పేదలకు అండగా నిలవడమే ఈ పథకాల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ఇదే తరుణంలో ప్రతిపక్ష బీజేపీ తీరుపై సిద్ధరామయ్య విమర్శలు గుప్పించారు. బీజేపీ చేపట్టిన 'బళ్లారి చలో' పాదయాత్రను కేవలం ఒక రాజకీయ గిమ్మిక్కుగా ఆయన అభివర్ణించారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై చర్చించకుండా, కేవలం మాజీ మంత్రి నాగేంద్ర రాజీనామా అంశంపైనే బీజేపీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. కరవు సహాయక చర్యల కోసం పూర్తిగా కేంద్రంపైనే ఆధారపడవద్దని, అవసరమైన తాలూకాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకోవాలని సీఎం శివకుమార్‌కు సూచించారు. పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉండాలని ఆయన కోరారు.

# చిన్నారుల కోసం 21 కొత్త పోషకాహార కేంద్రాలు

మొదటిపేజీ తరువాయి

ఇవన్నీ అందుబాటులోకి వస్తే రాష్ట్రంలో ఎన్ఆర్‌సీల సంఖ్య 21 నుంచి 42కు, పడకల సంఖ్య 340 నుంచి 515కు పెరుగుతాయని రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడొక ప్రకటనలో వెల్లడించారు. మరో ఆరు కేంద్రాల మంజూరు 2026–27 ఆర్థిక సంవత్సరంలో మరో ఆరు 10 పడకల ఎన్ఆర్‌సీలను ప్రభుత్వం మంజూరు చేసింది. అన్నమయ్య జిల్లా మదనపల్లె, చిత్తూరు, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కృష్ణా జిల్లా మచిలీపట్నం, శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో కేంద్రంలో 10 పడకలు చొప్పున మరో 60 పడకలు అందుబాటులోకొస్తాయి. 10 పడకల ఎన్ఆర్‌సీకి ఒక వైద్యాధికారి, ఒక పోషకాహార సలహాదారు, ఒక స్టాఫ్ నర్స్, ఒక వంట/సంరక్షణ సిబ్బంది, ఒక క్లీనర్ కమ్ అటెండర్‌ను మంజూరు చేశారు. 20 పడకల కేంద్రానికి ఇద్దరు వైద్యాధికారులు, ఇద్దరు పోషకాహార సలహాదారులు, ఇతర సిబ్బంది ఉంటారు. నిధుల కేటాయింపు ఎన్ఆర్‌సీలకు 2026–27లో మౌలిక వసతులు, సిబ్బంది సామర్థ్యం పెంపు, ఆశా కార్యకర్తల ప్రోత్సాహకాలు, నిర్వహణ ఖర్చుల కోసం మొత్తం రూ.4.42 కోట్లు కేటాయించారు. 2024–25లో రూ.3.75 కోట్లు, 2025–26లో రూ.3.56 కోట్లు కేటాయించారు. మానవ వనరుల కోసం ఏడాదికి రూ.12.22 కోట్లు మంజూరు చేశారు.

# కేటీఆర్, హరీశ్ రావుపై లైంగిక వేధింపుల కేసు

మొదటిపేజీ తరువాయి

నిబంధనల ప్రకారం అలాంటి దుస్తులు, వస్తువులకు అనుమతి లేదని పోలీసులు చెప్పగా, బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడారని మహిళా కానిస్టేబుల్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. హరీశ్‌రావు, కేటీఆర్ తమను అవమానకర రీతిలో దూషించారని ఆమె తెలిపారు. హరీశ్‌రావు తన టీ–షర్టును విప్పి ఓ పోలీసు అధికారిపైకి విసిరి, మహిళా సిబ్బంది ముందే అర్ధనగ్నంగా నిలబడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కూడా అదే విధంగా ప్రవర్తించి, తమకు తీవ్ర ఇబ్బంది కలిగించారని ఫిర్యాదులో వివరించారు. ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దాడి, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం వంటి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# తమిళనాడులో రాష్ట్ర పార్టీగా టీవీకే.. విజయ్ పార్టీకి ఈసీ అధికారిక గుర్తింపు...

మొదటిపేజీ తరువాయి

తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన టీవీకే, మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 108 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. రాష్ట్రవ్యాప్తంగా పోలైన ఓట్లలో 34.92 శాతం సాధించి తన సత్తా చాటింది. ఎన్నికల నిబంధనల ప్రకారం, ఒక పార్టీకి రాష్ట్ర పార్టీ హోదా దక్కాలంటే కనీసం 6 శాతం ఓట్లతో పాటు రెండు అసెంబ్లీ స్థానాలు గెలవాలి లేదా మొత్తం ఓట్లలో 8 శాతం సాధించాలి. టీవీకే ఈ నిబంధనలను సునాయాసంగా అధిగమించి ఈ గుర్తింపును సొంతం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీవీకేకు 'విజిల్'ను ఉమ్మడి గుర్తుగా ఈసీ కేటాయించగా, ఎన్నికల్లో సాధించిన ఘన విజయం నేపథ్యంలో ఇప్పుడు అదే గుర్తునే శాశ్వతంగా ఖరారు చేసింది. తాజా గుర్తింపుతో భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ టీవీకే ఇదే గుర్తుపై పోటీ చేసే అవకాశం లభించింది. తమిళనాడులో ఇప్పటికే గుర్తింపు పొందిన డీఎంకే, ఏఐఏడీఎంకే, సీపీఐ, వీసీకే, నామ్ తమిళర్ కట్చి, డీఎండీకే వంటి పార్టీల సరసన ఇప్పుడు టీవీకే కూడా చేరింది. ఫలితంగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీల సంఖ్య ఏడుకు చేరుకుంది. ఈ పరిణామం తమిళ రాజకీయాల్లో టీవీకేను ఒక ప్రధాన శక్తిగా ఆవిష్కరించింది.

# ప్రతి గణపతి మండపం సిసి కెమెరాల పర్యవేక్షణలో ఉండాలి

## -ప్రశాంతమైన వాతావరణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలి -మంథని సీఐ బుద్దే స్వామి

(ప్రజా సీమ): :

ప్రతి గణపతి మండపం సిసి కెమెరాల పర్యవేక్షణలో ఉండాలని, ప్రశాంతమైన వాతావరణంలో గణపతి ఉత్సవాలు జరుపుకోవాలని నిర్వాహకులకు మంథని సీఐ బుద్దే స్వామి సూచించారు. గురువారం మంథని పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ బుద్దే స్వామి ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, మంథని తహసిల్దార్ అరిఫుద్దీన్, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఎస్సై సందీప్ కుమార్ పాల్గొని మాట్లాడారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాలు ఏర్పాటు చేసేవారు ఖచ్చితంగా పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలని తెలిపారు. విద్యుత్ శాఖ నుండి అనుమతి తీసుకొని విద్యుత్ సరఫరా తీసుకోవాలని, మండపాల వద్ద ఫైర్ నివారణ చర్యలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. రెండు బాక్స స్పీకర్లు ఏర్పాటు చేసుకోవాలని, 10 తర్వాత భజన కార్యక్రమాలు కొనసాగించరాదని సూచించారు. ఎల్లప్పుడు ముగ్గురు స్వచ్ఛంద సేవకులు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ప్రతి గణపతి మండపం సిసి కెమెరా పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. మండపాల వద్ద రాజకీయ నినాదాలు, మద్యం సేవించరాదు, లక్కీ డ్రాలు వంటివి ప్రోత్సహించరాదని వివరించారు. గణపతి నిమర్జనం సమయంలో సూచించిన చెరువులో కార్యక్రమం పూర్తి చేయాల్సి ఉంటుందని వివరించారు. గణపతి నిమజ్జన ఊరేగింపులు డీజే కు అనుమతి లేదని పేర్కొన్నారు.





# స్వచ్ఛతాన్ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి లోకేష్

మొదటిపేజీ తరువాయి

ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఈ ఈవెంట్ నిర్వహించే అమరావతిరన్నర్స్ అధ్యక్షులు రమేష్ రావి, వారి బృందం సభ్యులు పాల్గొన్నారు. విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ ఇంటర్నేషనల్ స్టేడియమ్ వద్ద ఆ రోజు ఉదయం 5 గంటలకు స్వచ్ఛతా రన్ ప్రారంభమవుతుంది. 5కే, 10కే, 21.1కే (ఆఫ్ మేరాతన్) మూడు కేటగిరీలలో ఈ రన్ ని 'అమరావతి రన్నర్స్' వారు నిర్వహిస్తారు. బాలురు, బాలికలు, యువత ... అన్ని వయసుల వారు పాల్గొనడానికి అవకాశం కల్పిస్తారు. పాల్గొనేవారికి టీషర్ట్స్ తోపాటు బ్రేక్ ఫాస్ట్ కూడా ఏర్పాటు చేస్తారు. అన్ని విభాగాలలో విజేతలకు దాదాపు రూ.10 లక్షల విలువైన బహుమతులతోపాటు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేస్తారు. పాల్గొన్నవారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు. ఈ రన్ లో పాల్గొనేవారు ఈ నెల 20వ తేదీ లోపల తమ పేర్లను ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలి.

# లక్ష రూపాయల విలువైన వాటర్ ప్లాంట్ అందజేత

(ప్రజా సీమ):

కడకట్లలో బీవీకే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీఆర్ గోయింకా డిగ్రీ కళాశాలకు బిజెపి నర్సాపురం మీడియా కన్వీనర్ నరిసే సోమేశ్వరరావు తన తండ్రి నరిసే వీర్రాజు జ్ఞాపకార్థం లక్ష రూపాయల విలువైన వాటర్ ప్లాంట్‌ను అందజేశారు.విద్యార్థులకు స్వచ్ఛమైన, శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ వాటర్ ప్లాంట్‌ను కళాశాలకు అందించడం పట్ల పలువురు అభినందనలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఈతకోట తాతాజీ ప్రముఖ వ్యాపారవేత్త నంద్యాల కృష్ణమూర్తి, సుంకవల్లి రామకృష్ణ జిఎంఆర్ విద్యా సంస్థల అధినేత గ్రంధి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి, కళాశాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేలా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టిన నరిసే సోమేశ్వరరావును అభినందించారు.

# సీసీఎల్ఏలో స్ట్రక్చర్డ్ ల్యాండ్ బ్యాంక్ పోర్టల్

మొదటిపేజీ తరువాయి

మూడు నెలల కార్యాచరణ ముందుగానే ప్రతి ప్రభుత్వ శాఖ, జిల్లా కలెక్టర్ స్పష్టమైన యాక్షన్ క్యాలెండర్ ను రూపొందించుకుని నిర్దేశిత గడువులోగా ఫలితాలు సాధించాలన్నారు. కలెక్టర్ల సదస్సు కేవలం చర్చలకు మాత్రమే పరిమితం కాకుండా ఫలితాలను సాధించేలా ఉండాలన్నారు. జిల్లాల అధిపతులుగా కలెక్టర్లు అన్ని శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై 360 డిగ్రీల కోణంలో దృష్టి సారించాలని అన్నారు. శాఖల మధ్య ప్రభావితం అయ్యే పనుల్ని కలెక్టర్ పరిష్కరించాలన్నారు. సమస్యల్ని ప్రస్తావించటం ఒక్కటే కాకుండా పరిష్కారం చూపేలా కలెక్టర్లు వేగంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. బాధ్యతను మరొకరికి బదిలీచేసే తత్వాన్ని విడనాడాలన్నారు. ముఖ్యమంత్రిగా తాను మూడు నెలల కార్యక్రమాలను ముందే నిర్దేశించుకుంటా నని వెల్లడించారు. ప్రతీ నెలా ఎస్ఐపీబీ సమావేశాలతో పాటు ప్రతీ 15 రోజులకూ కేబినెట్ సమావేశంతో పాటు ప్రతీ మూడు నెలలకూ కలెక్టర్ల సదస్సు, ప్రతీ నెలా 4 రోజుల పాటు క్షేత్రస్థాయిలో ప్రజల దగ్గరకు వెళ్తున్నానని అన్నారు. సీఎంగా తనపై కేంద్ర ప్రభుత్వం కూడా ఉంటుందని దానికి అనుగుణంగానే ప్రణాళిక చేసుకుంటున్నట్టు సీఎం కలెక్టర్లకు వివరించారు. కాలాన్ని సద్వినియోగం చేసుకునేలా కలెక్టర్లు కూడా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. నిర్ణయాల్లోనూ ఎస్కేపిజం కుదరదని రియాక్టివ్ గవర్నెన్స్ కంటే ప్రోయాక్టివ్ గవర్నెన్సుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం దిశానిర్దేశం చేశారు. యాక్షన్ టేకెన్ రిపోర్టు పై దిశానిర్దేశం ఎస్సీ వర్గాలకు ఇచ్చే ప్రయోజనాలను బుడగ జంగాలకు పొడిగించే అంశంపై తక్షణం ఉత్తర్వులు జారీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బుడగ జంగాలకు ఎస్సీ హోదా కల్పించే అంశం పెండింగులో ఉన్న నేపథ్యంలో ఎస్సీలకు కలిగే ప్రయోజనాలను వారికీ అందించాలని సీఎం స్పష్టం చేశారు. వివిధ పరిశ్రమలతో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని అనుసంధానించాలని అన్నారు. కరిక్యులమ్, పరికరాలు తదితర అంశాలను 90 రోజుల్లోగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే మంజూరైన గృహాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. అదనంగా మంజూరు అయ్యే గృహాలను దశలవారీగా అమలు చేయాలని సీఎం నిర్దేశించారు. త్వరలోనే మరో 1.5 లక్షల గృహాలు ఏపీకి అదనంగా మంజూరు అయ్యే అవకాశం ఉందని సీఎం వెల్లడించారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో తాగునీటి సరఫరా విషయంలో అత్యవసర పనుల్ని వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. రాష్ట్రంలో 50 శాతం హరిత ప్రాంతాన్ని సాధించేలా ప్లాంటేషన్ సీజన్ కు ముందే అవసరమైన 20 కోట్ల విత్తనాలను, మొక్కల్ని సిద్ధం చేసుకోవాలన్నారు. తక్కువ నీటి అవసరం ఉన్న మొక్కల్ని ప్రోత్సహించాలని నీటి సంరక్షణా పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్ విధానంలో సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 905 స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించి కేంద్రంతో మాట్లాడాలని స్పష్టం చేశారు.

# నారా లోకేశ్ అడ్డంగా దొరికిపోయారు: అంబటి రాంబాబు

మొదటిపేజీ తరువాయి

ఈ మొత్తం నియామక అక్రమాలపై తక్షణమే సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.డీఎస్సీపై ప్రతిపక్షాలు, అభ్యర్థులు ఆధారాలతో సహా ప్రశ్నిస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేశ్ ఏమీ మాట్లాడకుండా మత్తు ఇంజక్షన్లు తీసుకున్నట్లు మౌనం పాటిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఐఏఎస్ అధికారులను ముందరకు నెట్టి మాట్లాడిస్తున్నారని ఆరోపించారు."నారా లోకేశ్ ఉద్యోగాలను బఠానీలు అమ్మినట్లు మార్కెట్లో అమ్మేశారు. ఆయన దొరికిపోయిన దొంగ. రాజకీయాలకు, మంత్రి పదవికి ఎంతమాత్రం పనికిరారు" అని తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. లోకేశ్ ను భవిష్యత్తులో ముఖ్యమంత్రిని చేయాలని చూస్తున్నారని, ఒకవేళ ఆయనకు ఆ పదవి ఇస్తే ఏకంగా రాష్ట్రంతో పాటు దేశాన్నే అమ్మేస్తారని ఎద్దేవా చేశారు. లోకేశ్ వైఖరి వల్లే టీడీపీ సర్వనాశనం కాబోతోందని వ్యాఖ్యానించారు.ఇప్పటికే జరిగిన డీఎస్సీలోనే వందలాది పోస్టులు అక్రమాలకు గురయ్యాయని, మళ్లీ మరో రెండు డీఎస్సీలు నిర్వహిస్తామని ప్రకటించడం నిరుద్యోగులను మోసం చేయడమేనని అన్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ఆడుకున్న లోకేశ్ తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని అన్నారు.

# 28 లక్షల ఎకరాలు 22-ఏ జాబితా నుండి తొలగింపు

మొదటిపేజీ తరువాయి

గత ప్రభుత్వంలో ఫ్రీ హోల్డ్ చేసిన భూముల్లో నిబంధనల ప్రకారం ఉన్న 9 లక్షల ఎకరాలకు రిజిస్ట్రేషన్లకు అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. అయితే ఫ్రీహోల్డ్ భూముల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు గుర్తించిన 4 లక్షల ఎకరాలపై పూర్తిస్థాయి విచారణ తర్వాత తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం కక్షపూరితంగా 22–ఏ (నిషేధిత) జాబితాలో చేర్చిన 28 లక్షల ఎకరాలను ఇప్పటికే తొలగించామని తెలిపారు. 22–ఏ తొలగింపు ప్రక్రియను సులభతరం చేస్తూ జీవో నెం.444 జారీ చేశామని, దీని ద్వారా వచ్చిన 28,790 ఎకరాల దరఖాస్తుల్లో ఇప్పటికే 1,100 ఎకరాలను జాబితా నుంచి తొలగించామని, మిగిలిన వాటిపై కూడా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు

# ప్రజల అభిమానం చూరగొన్న నాయకుడు ఎంపీ మిథున్ రెడ్డి

## - వైకాపా నేత మయూరి రఘునాథ్ రెడ్డి ప్రశంసలు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి ప్రజల అభిమానం చూరగొన్న నాయకుడని వైఎస్ఆర్సిపి మేధావుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.రఘునాథరెడ్డి (మయూరి) ప్రశంసించారు.శుక్రవారం ఎంపీ పుట్టినరోజుని పురస్కరించుకొని వైకాపా ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల మల్లికార్జునతో కలిసి గురువారం రాత్రి తిరుపతిలోని ఎంపీ నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ తన తండ్రి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నుండి రాజకీయ వారసత్వాన్ని పునికి పుచ్చుకున్న ఎంపీ అనతికాలంలో దేశ రాజకీయాలను ఆకర్షించారన్నారు.మూడుసార్లు ఎంపీగా గెలిచి తానేమిటో నిరూపించుకున్నారన్నారు.ఎంపీగా రాజంపేట పార్లమెంట్ అభివృద్ధితోపాటు రాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేశారని,ముఖ్యంగా పీలేరు - మదనపల్లి నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో ఆయన పాత్ర క్రియాశీలకమన్నారు.మాజీ ముఖ్యమంత్రి,వైకాపా అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డికి అన్ని విషయాలలో చేదోడువాదోడుగా ఉంటూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు.ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం పరితపించే పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని,భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.



# ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలి

## - ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

## - మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి,డీఎస్పీ బుచ్చిరాజు సూచనలు





**మదనపల్లె (ప్రజా సీమ) :**

ఈ నెల 14న నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా ,క్రమబద్ధంగా,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మదనపల్లె సబ్ కలెక్టర్,సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఆధ్వర్యంలో గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి మాట్లాడుతూ వినాయక చవితి ప్రతి ఇంట్లో ఆనందాన్ని నింపే పండుగగా,ఎలాంటి విషాద ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ముగిసేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. వివిధ శాఖలు,ఉత్సవ నిర్వాహకులు,శాంతి కమిటీ సభ్యులు పరస్పర సమన్వయం,సహకారంతో పనిచేయాలని సూచించారు.మదనపల్లె పట్టణంలో అన్నిమతాల ప్రజలు పరస్పర సహకారంతో వివిధ పండుగలను సామరస్య పూర్వకంగా నిర్వహించుకుంటున్నారని,ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వినాయక చవితి ఉత్సవాలను కూడా ప్రశాంతంగా నిర్వహించాలన్నారు.గతంలో సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి,ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటిలభ్యత తక్కువగా ఉన్నందున వినాయక విగ్రహాల నిమజ్జనానికి అనువైన చెరువులు,నీటి వనరులను ముందుగానే గుర్తించినట్లు తెలిపారు.నిమజ్జన ప్రాంతాల్లో లైటింగ్,పారిశుధ్యం,రహదారి సౌకర్యాలను సంబంధిత శాఖలు సమన్వయంతో ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు అవసరమైన చోట రహదారి,పొదల తొలగింపు పనులు చేపట్టాలని,ఇరిగేషన్ శాఖ అధికారులు అవసరమైన డీసిల్టేషన్ పనులు చేపట్టాలని సూచించారు.

### పర్యావరణహిత మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలి

నీటివనరులు పరిమితంగా ఉన్న నేపథ్యంలో వాటిని కాలుష్యానికి గురికాకుండా పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. ఉత్సవ నిర్వాహకులు పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని కోరారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛందంగా సహకరించాలని సూచించారు.

### మండపాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతి వినాయక మండపాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని,డీజేలు,విద్యుత్,అగ్నిమాపక భద్రత తదితర అంశాలకు సంబంధించి అవసరమైన అనుమతులు ముందుగానే పొందాలని తెలిపారు.అనంతరం మదనపల్లి డీఎస్పీ బుచ్చిరాజు మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు సంబంధించిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అవసరమైన అనుమతులు జారీ చేయాలని సంబంధిత అధికారులను కోరారు.రాత్రి 10 గంటల తర్వాత డీజేలకు అనుమతి లేదని,నిర్ణీత శబ్ద పరిమితులను తప్పనిసరిగా పాటించాలని చేశారు .ఆసుపత్రులు ,పాఠశాలలు, ఇతర సున్నిత ప్రాంతాలకు ఇబ్బంది కలగకుండా శబ్ద కాలుష్యాన్ని నియంత్రించాలని సూచించారు .అసభ్యకర కార్యక్రమాలకు తావివ్వ కూడదువినాయక మండపాల వద్ద అసభ్యకరమైన పాటలు,నృత్యాలు,మద్యం సేవించి గొడవలకు పాల్పడటం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని అలాంటి వాటిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఉత్సవ కమిటీ నిర్వాహకులు యువతకు ముందుగానే తగిన సూచనలు చేయాలని కోరారు.

### సమస్యల పరిష్కారానికి ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ప్రజలకు,నిర్వహకులకు ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 8571231181 మరియు ల్యాండ్ లైన్ నెంబర్ 08571-231181 సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.ఉత్సవాల సందర్భంగా ఏదైనా సమస్య తలెత్తితే ఈ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.ఉత్సవ నిర్వాహకులు,సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో మీడియా ప్రతినిధుల పాత్ర కీలకమని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు,భద్రతా సూచనలు ,పర్యావరణ పరిరక్షణ,శబ్ద కాలుష్య నియంత్రణ తదితర అంశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు.ప్రతి శాఖ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉత్సవ నిర్వాహకులు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగితే వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా,ఆనందదాయకంగా నిర్వహించుకోవచ్చని తెలిపారు.ప్రతి ఇంట్లో ఆనందం వెల్లివిరియేలా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో మదనపల్లె తహసీల్దార్ మాధవి, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల,ఎంపీడీవో, మదనపల్లె డివిజన్‌లోని వివిధ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, అగ్నిమాపక శాఖ అధికారులు, మండలస్థాయి అధికారులు,శాంతి కమిటీ సభ్యులు ,వినాయక ఉత్సవాల నిర్వాహకులు ,మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పని పూర్తయ్యే వరకు కాదు..

పిఠాపురం ప్రగతిపై ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ ప్రత్యేక సమీక్ష

ప్రతి అభివృద్ధి పనిపై ఆరా.. నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశాలు

అంగన్‌వాడీ, రైతు సేవా కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నిర్మాణాలకు వేగవంతం చేయాలి

శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలు తప్పనిసరి

పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల పనుల పురోగతిపై ఆరా

ఆర్వోబీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం

చేనేత, మత్స్యకారుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

పారిశుధ్య మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యత

ఆయుష్ మెడికల్ కాలేజీ ప్రక్రియను వేగవంతం చేసి, ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని ఉప ముఖ్యమంత్రివర్యులు ఆదేశం




## ప్రజలకు ఫలితం అందే వరకూ పర్యవేక్షణ ఉండాలి

**పిఠాపురం (ప్రజా సీమ )**

నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. నియోజకవర్గవ్యాప్తంగా చేపట్టిన వివిధ అభివృద్ధి, మౌలిక వసతుల పనుల స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేరళంలో చికిత్స పొందుతున్న శ్రీ పవన్ కళ్యాణ్ అక్కడి నుంచి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే పనులను ప్రాధాన్యత క్రమంలో వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్ష సందర్భంగా అధికారులు వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న పనుల పురోగతిని ఉప ముఖ్యమంత్రి వివరించారు. ఏ పనులు పూర్తయ్యాయి, ఏవి పురోగతిలో ఉన్నాయి, తదుపరి కార్యాచరణ ఏ చర్యలు తీసుకోవాల్సి ఉంది లాంటి అంశాల గురించి ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి, అవసరమైన పరిపాలనా, సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేసి నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. పాఠశాలల అభివృద్ధి, మౌలిక వసతులపై సమీక్షనియోజకవర్గంలోని పాఠశాలలకు రక్షణ గోడల నిర్మాణం ఎంత వరకు పూర్తయిందని అధికారులను శ్రీ పవన్ కళ్యాణ్ అడిగి తెలుసుకున్నారు. అధికారులు పాఠశాలలవారీగా పనుల పురోగతిని వివరించగా, మిగిలిన పనులను కూడా వేగవంతం చేసి విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. పాఠశాలల అప్‌గ్రేడేషన్, అదనపు తరగతి గదులు, ఆటస్థలాల అభివృద్ధి, రక్షణ గోడల కోసం రూ.3.5 కోట్లతో చేపట్టిన పనుల వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. అదేవిధంగా, యు. కొత్తపల్లి మండలం మూలపేటలోని జిల్లా పరిషత్ పాఠశాలలో రూ.1.34 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఎనిమిది అదనపు తరగతి గదుల పనుల ప్రక్రియను వేగవంతం చేసి, వి ద్యా ర్థు ల కు అవసరమైన మౌలిక వసతులను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని శ్రీ పవన్ కళ్యాణ్ సూచించారు. వీధి దీపాలు, సీసీ డ్రైనేజీలు, రోడ్లు, తాగునీరు, పారిశుధ్యానికి సంబంధించిన పనుల పురోగతిని అధికారులు వివరించారు. ప్రజలు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాలను గుర్తించి అక్కడి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని శ్రీ పవన్ కళ్యాణ్ చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల ఆధునికీకరణ పనుల పరిస్థితిని కూడా అడిగి తెలుసుకుని, పనులు పూర్తయిన వెంటనే ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టిశ్మశాన వాటికల నిర్మాణం, అభివృద్ధి పనుల వివరాలను అధికారులు ఉప ముఖ్యమంత్రి కి వివరించారు. శ్మశాన వాటికల్లో ట్యాపులు, తాగునీటి సదుపాయం, పారిశుధ్యం తదితర కనీస వసతులను మెరుగుపరచాలని శ్రీ పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ముఖ్యంగా ఎస్సీ జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లోని శ్మశాన వాటికలను గుర్తించి, అక్కడి మౌలిక వసతుల అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సంక్షేమ వసతి గృహాల్లో జరుగుతున్న మరమ్మతులు, అభివృద్ధి పనులపై సమీక్షించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన వసతులు అందించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ల నిర్మాణాలపై అధికారులు పురోగతిని వివరించారు. నిలిచిపోయిన పనులకు కారణాలను తెలుసుకున్న శ్రీ పవన్ కళ్యాణ్ , అవసరమైన అనుమతులు, ప్రక్రియలను పూర్తి చేసి ప్రజా సేవలకు ఉపయోగపడే కేంద్రాలను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పిఠాపురం, గొల్లప్రోలు అభివృద్ధి పనుల వివరాలుపిఠాపురం మున్సిపాలిటీలో సుమారు రూ. 300 కోట్ల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నట్లు అధికారులు వివరించారు. గొల్లప్రోలు మున్సిపాలిటీలో తాగునీరు, డ్రైనేజీలు, రోడ్లు, పారిశుధ్యానికి సంబంధించి రూ.100 కోట్ల పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి గారు ప్రజలకు ఉపయోగపడేలా పనులు నాణ్యతతో పూర్తి చేయాలని దిశా నిర్దేశం చేశారు.ఆలయాల అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షఆలయాల అభివృద్ధి పనుల పురోగతిపై శ్రీ పవన్ కళ్యాణ్ గారు అధికారులతో సమీక్షంచారు. రూ.30.66 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనుల ప్రస్తుత స్థితి, పూర్తయిన పనులు, పురోగతిలో ఉన్న పనుల వివరాలను అధికారులు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి వివరించారు. ఇందులో 24 దేవాలయాల పునరుద్ధరణకు రూ.17.06 కోట్లు, టీటీడీ కల్యాణ మండపానికి రూ.2 కోట్లు, 48 భజన మందిరాల అభివృద్ధికి రూ.11.60 కోట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఆయా పనుల పురోగతిని సమీక్షించిన శ్రీ పవన్ కళ్యాణ్ గారు, భక్తులకు మెరుగైన వసతులు అందేలా పనులను నిర్ణీత ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఆర్.ఒ.బి. నిర్మాణంపై ప్రత్యేకంగా ఆరారూ.118 కోట్ల అంచనా వ్యయంతో పిఠాపురంలో చేపట్టనున్న రోడ్ ఓవర్ బ్రిడ్జ నిర్మాణానికి సంబంధించిన ప్రస్తుత స్థితి, ఇప్పటివరకు పూర్తయిన ప్రక్రియ, ఇంకా పెండింగ్‌లో ఉన్న అంశాలను అధికారులు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి వివరించారు. ఈ ప్రాజెక్టును ప్రధానమంత్రి గతిశక్తి పథకం కిందకు తీసుకురావడంతో నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి సమకూరాల్సి ఉందని తెలిపారు. ఆర్.ఓ.బి నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు సంబంధించిన ప్రతిపాదనల నివేదికను ఇప్పటికే సిద్ధం చేసి, రైల్వే బోర్డు ఆమోదం కోసం పంపినట్లు వివరించారు. పరిపాలనా, సాంకేతిక, సమన్వయపరమైన అంశాలను త్వరగా పరిష్కరించి ఆర్.ఒ.బి. నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆదేశించారు. పాడా రూ.50 కోట్ల నిధులపై సమీక్షపిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కింద మంజూరైన రూ.50 కోట్ల క్రిటికల్ గ్యాప్ ఫండింగ్ వినియోగానికి సంబంధించిన వివరాలను అధికారులు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి వివరించారు. ఇందులో పిఠాపురం బస్టాండ్ ఆధునికీకరణకు రూ.20 కోట్లు, పాఠశాలల అభివృద్ధికి రూ.3.5 కోట్లు, స్మార్ట్ కిచెన్‌ల ఏర్పాటుకు రూ.2 కోట్లు, ఫిష్ మార్కెట్ ఆధునికీకరణకు రూ.50 లక్షలు కేటాయించినట్లు తెలిపారు.



అదేవిధంగా పాడా పరిధిలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం ఇప్పటి వరకు మొత్తం రూ.1,026.34 కోట్ల నిధులు మంజూరైనట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో రూ.323 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఉప్పాడ సముద్ర రక్షణ గోడ నిర్మాణం కూడా ఉందని వివరించారు. వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో రూ. 703.34 కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వివరించారు. మంజూరైన నిధులను సద్వినియోగం చేస్తూ, అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. పారిశుధ్య వ్యవస్థ బలోపేతంపై ఆదేశాలుపిఠాపురం మున్సిపాలిటీలో ఘనవ్యర్థాల నిర్వహణ, పారిశుధ్య వ్యవస్థపై అధికారులు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి వివరాలు అందించారు. వ్యర్థాల నిర్వహణ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు బేలింగ్ మిషన్ మంజూరైనట్లు తెలిపారు. అలాగే పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపాలిటీల పరిధిలోని చిన్నజగ్గంపేట, అగ్రహారం, జగ్గయ్యచెరువు, రథాలపేట, పోస్ట్ ఆఫీసు వీధి ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్లు మంజూరైనట్లు అధికారులు వివరించారు. మంజూరైన పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణ పనులను త్వరితగతిన గ్రౌండింగ్ చేసి, నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆదేశించారు.ఆయుష్ మెడికల్ కాలేజీ పురోగతిపై ఆరారూ. 100 కోట్లతో పిఠాపురంలో ప్రతిపాదిత ఆయుష్ మెడికల్ కాలేజీకి సంబంధించి భూసేకరణ, అనుమతుల పరిస్థితిని అధికారులు వివరించారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, వివిధ శాఖల నుంచి అవసరమైన అనుమతులు త్వరగా పొందేలా సమన్వయంతో పనిచేయాలని శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆదేశించారు. అభివృద్ధి పనులు వేగంగా పూర్తయి వాటి ఫలాలు ప్రజలకు చేరేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. హ్యాండ్లూమ్ సెంటర్ పనులు వేగవంతం చేయండి చేనేత కార్మికులకు ఆధునిక వసతులు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రూ.15 కోట్ల అంచనా వ్యయంతో మంజూరైన హ్యాండ్లూమ్ సెంటర్ పురోగతిపై రాష్ట్ర శ్రీ పవన్ కళ్యాణ్ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ కేంద్రం నిర్మాణానికి సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖల నుంచి రావాల్సిన అన్ని రకాల సాంకేతిక, పరిపాలనా అనుమతులను త్వరితగతిన సాధించాలని, ఎక్కడా ఆలస్యం కాకుండా ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. మత్స్యకారుల సంక్షేమ పనుల పురోగతిపై సమీక్షమత్స్యకారుల జీవనోపాధి, సంక్షేమం, భద్రతకు సంబంధించిన కార్యక్రమాల పురోగతిపై శ్రీ పవన్ కళ్యాణ్ గారు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం రూ.26.32 కోట్ల వ్యయంతో చేపడుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని అధికారులు ఆయనకు వివరించారు. వేట నిషేధ భృతి, వివిధ సబ్సిడీల కింద రూ.19.11 కోట్లు, మత్స్యకారుల భద్రత, పరిహారాల కోసం రూ.3.12 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. యు.కొత్తపల్లి మండలంలో 1,258 బోట్లకు లైఫ్ జాకెట్లు, ఐస్ బాక్సుల సరఫరా, 5 బయోఫ్లోక్ యూనిట్లు, 76 డ్రై ఫిష్ యూనిట్లు, ముఖ్యంగా మత్స్యకార మహిళలు చేపల రవాణా, విక్రయాలు సులువుగా చేసుకునేందుకు వీలుగా 30 హోండా ద్విచక్ర వాహనాల పంపిణీ పనులు కూడా ప్రగతిలో ఉన్నట్లు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి వివరించారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో, పూర్తిస్థాయిలో అందేలా చూడాలని శ్రీ పవన్ కళ్యాణ్ గారు అధికారులను ఆదేశించారు. అలాగే పురోగతిలో ఉన్న పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

ప్రజాసీమ

# బీసిల నిజమైన నేస్తం కాంగ్రెస్

## - ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా.తులసిరెడ్డి

**వేంపల్లె ప్రజాసీమ:**

బీసీల సాధికారతకు కాంగ్రెస్ పార్టీ కృషి చేసిందని, నిజమైన నేస్తం కాంగ్రెస్ మాత్రమేనని ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా.తులసిరెడ్డి అన్నారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే బీసీలకు బంగారు భవిష్యత్ అని ఆ పార్టీ నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదం అన్నారు. 1970లో అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి విద్యా, ఉద్యోగాల్లో 25 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ జీఓ 1793 జారీ చేశారన్నారు. ఆ సమయంలో టిడిపి, జనసేన, వైకాపా పుట్టలేదన్నారు. అలాగే స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించింది టిడిపి అని నేతల గొప్పలు చెప్పుకోవడం వాస్తవానికి విరుద్ధమన్నారు. 1993లో కోట్ల విజయభాస్కర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం బీసిలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు చట్టం చేయడం జరిగిందన్నారు. బీసి హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, దోభి ఘాట్లు, స్టడీ సెంటర్లు ఏర్పాటు చేశారన్నారు. టిడిపికి బీసిలపై నిజమైన ప్రేమ ఉంటే ముఖ్యమంత్రి పదవిని బీసిలకు ఇవ్వాలని తులసిరెడ్డి సవాల్ విసిరారు.



# కోడి కూతకు ముందే మద్యం విక్రయాలు

## - చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ
## - నిబంధనలకు తూట్లు పొడుస్తున్న పట్టించుకోని వైఖరి
## - కాంగ్రెస్ ఇంచార్జ్ మూలంరెడ్డి ధృవకుమార్ రెడ్డి

**వేంపల్లె ప్రజాసీమ:**

కోడి కూతకు ముందే మద్యం విక్రయాలు కొనసాగుతున్న సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు చోద్యం చూస్తున్న వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇంచార్జ్ మూలంరెడ్డి ధృవకుమార్ రెడ్డి మండిపడ్డారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లెలోని మద్యం షాపుల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా తెల్లవారుజాము నుంచే టీ షాప్ లా మాదిరిగా మద్యం విక్రయాలు చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో పనులకీ వెళ్లే కూలీలు తెల్లవారుజాము నుంచే మద్యం సేవించి రోడ్లపై పడిపోవడం యథావిధిగా కొనసాగుతున్నట్లు ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉదయం 10 గంటలకు మాత్రమే బ్రాంది షాపులు తెరవాలన్నారు. కానీ అందుకు భిన్నంగా తెల్లవారుజామున 5 గంటల నుంచే బ్రాంది షాపులు తెరిచి మద్యం విక్రయాలు చేస్తున్నట్లు మండిపడ్డారు. దీనిపై ఎక్సైజ్ శాఖ అధికారులు చూసి చూడనట్లు.. నిబంధనలకు తూట్లు పొడుస్తున్న పట్టించుకోని వైఖరి దాపురించి ఉందన్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేదంటే ఎక్సైజ్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.



# నూతన పెన్షన్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

## ఎర్రయ్యగారిపల్లి స్వర్ణ గ్రామంలో పర్యటించిన ఎంపీడీవో భాను ప్రసాద్

**కలకడ ప్రజాసీమ :**

మండలంలో నూతన భరోసా పెన్షన్ల నమోదు, వెరిఫికేషన్ ప్రక్రియను అధికారులు వేగవంతం చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం కలకడ మండల ఎంపీడీవో భాను ప్రసాద్ ఎర్రయ్యగారిపల్లి స్వర్ణ గ్రామంలో పర్యటించి పెన్షన్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు.మండలంలో కొత్తగా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. సెప్టెంబర్ 10 ఉదయం 10 గంటల వరకు అన్ని రకాల పెన్షన్లు కలిపి మొత్తం 212 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.నూతన పెన్షన్ల నమోదుకు గడువు తక్కువగా ఉన్నందున అర్హులైన లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా అవసరమైన అన్ని ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో సచివాలయ సిబ్బందిని సంప్రదించి తమ దరఖాస్తులను త్వరగా నమోదు చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది అవసరమైన సహకారం అందించాలని ఆయన ఆదేశించారు.అలాగే పెన్షన్ల నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరి దరఖాస్తు సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఎంపీడీవో భాను ప్రసాద్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాను ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి (గ్రాణా) దేవేంద్ర, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, గ్రామ నాయకులు ఈశ్వర్, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కొరకు ఆదిత్యలో అంతర్గత హ్యాకథాన్

## - విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన

**మదనపల్లె (ప్రజా సీమ) :**

పుంగనూరు రోడ్డులోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ మదనపల్లెలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ (ఎస్.ఐ.హెచ్)-2026 కోసం అంతర్గత హ్యాకథాన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించింది.విద్యార్థులలో వినూత్న ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించడం, వాస్తవ ప్రపంచ సమస్యలను గుర్తించడం మరియు సమాజ,దేశాభివృద్ధికి దోహదపడే ఆచరణాత్మక సాంకేతిక పరిష్కారాలను రూపొందించేలా వారిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం.ఈ కార్యక్రమానికి సంస్థ కార్యదర్శి అండ్ కరస్పాండెంట్ ఆర్.రామమోహన్ రెడ్డి మరియు అధ్యక్షుడు ఎం.నాగమల్లా రెడ్డి ముఖ్య పోషకులుగా హాజరయ్యారు.డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగా రెడ్డి పోషకుడిగా,ప్రిన్సిపాల్ డాక్టర్ రాయుడు పెయ్యల సహ-పోషకుడిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు డేటా సైన్స్ విభాగం ప్రొఫెసర్ అండ్ హెడ్ మరియు ఎస్ఐహెచ్ -2026 యొక్క ఎస్.పి.ఒ.సి అయిన డాక్టర్ ఆర్.మహమ్మద్ షఫీ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ పాల్గొన్న విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.చిత్తూరులోని అపోలో యూనివర్సిటీ,స్కూల్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వై.శ్రీరామన్ న్యాయనిర్ణేతగా (జ్యూరీ మెంబర్) హాజరై,పాల్గొన్న విద్యార్థులతో ముచ్చటించారు.సభను ఉద్దేశించి మాట్లాడుతూ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి ఆధునిక సమాజంలో ఆవిష్కరణ ,సృజనాత్మకత మరియు సాంకేతికతకు పెరుగుతున్న ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు.సంప్రదాయ ఆలోచనా విధానాన్ని అధిగమించి,నిజ జీవిత సవాళ్లకు పరిష్కారాలను రూపొందించడంపై దృష్టి పెట్టాలని ఆయన విద్యార్థులను ప్రోత్సహించారు .జట్టుకృషి ,సృజనాత్మకత మరియు అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా విద్యార్థులు తమ ఆలోచనలను ఆచరణాత్మక పరిష్కారాలుగా మార్చుకోవడానికి హ్యాకథాన్‌లు ఒక అద్భుతమైన వేదికను అందిస్తాయని ఆయన పేర్కొన్నారు.ప్రిన్సిపాల్ డాక్టర్ రాయుడు పెయ్యాల,అంతర్గత హ్యాకథాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులందరినీ అభినందించారు.సమస్య పరిష్కార ప్రక్రియలో చురుకుగా పాల్గొని,తమ సాంకేతిక పరిజ్ఞానం ,భావ ప్రసార నైపుణ్యాలు,జట్టుకృషి,నాయకత్వ లక్షణాలు మరియు వినూత్న ఆలోచనా విధానాన్ని మెరుగుపరచుకోవడానికి లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విద్యార్థులను ప్రోత్సహించారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంలో అధ్యాపక బృందం మరియు సమన్వయకర్తలు చేసిన కృషిని కూడా ఆయన అభినందించారు.స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ (ఎస్.ఐ.హెచ్ - 2026) యొక్క ఎస్.పి.ఒ.సి అయిన డాక్టర్ ఆర్.మహమ్మద్ షఫీ,దాని భావన,లక్ష్యాలు మరియు ప్రాముఖ్యతను వివరించారు.సమస్య ప్రకటనలను అర్థం చేసుకోవడం,బృంద ఏర్పాటు,ఆలోచనల రూపకల్పన,పరిష్కార అభివృద్ధి,నమూనా తయారీ,ధృవీకరణ మరియు ప్రదర్శన వంటి (ఎస్.ఐ.హెచ్)లోని వివిధ దశల గురించి ఆయన పాల్గొన్నవారికి క్లుప్తంగా తెలియజేశారు.అర్థవంతమైన సమస్యలను ఎంచుకోవడం,వినూత్నమైన,ఆచరణీయమైన మరియు విస్తరించదగిన పరిష్కారాలను అభివృద్ధి చేయడం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు,డీన్‌లు,విభాగాధిపతులు మరియు అధ్యాపక సభ్యులు చురుకుగా పాల్గొన్నారు. యాజమాన్యం,విద్యా నాయకత్వం,జ్యూరీ సభ్యులు,అధ్యాపకులు మరియు విద్యార్థుల సమక్షం,వారి మార్గదర్శకత్వం ఆవిష్కరణలకు మరియు సహకార అభ్యాసానికి ప్రోత్సాహకరమైన వాతావరణాన్ని సృష్టించాయి.ఈ అంతర్గత హ్యాకథాన్,విద్యార్థులకు వారి ఆలోచనలను ప్రదర్శించడానికి,వారి సాంకేతిక సామర్థ్యాలను చాటుకోవడానికి మరియు సామాజిక, పారిశ్రామిక సంబంధిత సవాళ్లను పరిష్కరించడానికి సహకారంతో పనిచేయడానికి ఒక విలువైన అవకాశాన్ని అందించింది.ఈ కార్యక్రమం ఆవిష్కరణ, జట్టుకృషి ,సృజనాత్మకత మరియు సమస్య పరిష్కార స్ఫూర్తితో ముగిసింది.ఇది పాల్గొన్న విద్యార్థులను ప్రభావవంతమైన పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి మరియు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2026లో సంస్థకు అత్యుత్తమంగా ప్రాతినిధ్యం వహించడానికి ప్రేరేపించింది.




# మున్సిపాలిటీ పరిధిలో 144 ముసాయిదా పోలింగ్ కేంద్రాలు

## - మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల వెల్లడి





**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లె పురపాలక సంఘంలోని 48 వార్డులకు సంబంధించి 144 ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం,సీడీఎంఏ ఆదేశాల మేరకు గురువారం ప్రకటించారు.మున్సిపల్ కమిషనర్ ప్రమీల ఆధ్వర్యంలో ఆమె చాంబర్‌లో ముసాయిదా పోలింగ్ కేంద్రాల ప్రచురణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వెయ్యి మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్న మార్గదర్శకాల మేరకు కేంద్రాలను ప్రతిపాదించినట్లు ఆమె తెలిపారు.మున్సిపాలిటీ పరిధిలో 1,16,950 మంది ఓటర్లు ఉండగా 144 పోలింగ్ కేంద్రాల ప్రకారం ఒక్కో కేంద్రానికి సగటున 812 మంది ఓటర్లు ఉండేలా ప్రతిపాదనలు రూపొందించినట్లు ప్రమీల పేర్కొన్నారు.ఓటర్లు పోలింగ్ కేంద్రానికి చేరుకునే దూరం రెండు కిలోమీటర్లకు మించకుండా ఉండేలా అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలను ఎంపిక చేసినట్లు తెలిపారు.ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో ప్రైవేటు పాఠశాలలను పోలింగ్ కేంద్రాలుగా ప్రతిపాదించినట్లు వివరించారు.ప్రతి వార్డులోని ఓటర్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించినట్లు చెప్పారు.జిల్లా కలెక్టర్ ఆమోదంతో ముసాయిదా జాబితాను ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.ఈ నెల 11న రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించి వారి సలహాలు,సూచనలు స్వీకరించ నున్నట్లు వెల్లడించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం ,కలెక్టర్ కార్యాలయం,త హసీల్దార్ కార్యాలయం,మున్సిపల్ కార్యాలయాల్లో జాబితాను ప్రజల పరిశీలనకు ఉంచుతామని పేర్కొన్నారు.పోలింగ్ కేంద్రాలపై ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, సూచనలను పరిశీలించిన అనంతరం ఈ నెల 13న జిల్లా కలెక్టర్ అనుమతితో తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రకటించనున్నట్లు ప్రమీల తెలిపారు.ప్రజలు తమ వార్డుకు కేటాయించిన పోలింగ్ కేంద్ర వివరాలను పరిశీలించి,ఏవైనా సూచనలు లేదా అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పార్టీలు మారుతూ ఎంపీపై విమర్శలు సరికాదు

## ఎంపీ మిథున్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు వారికి లేదు వైఎస్సార్‌సీపీ నాయకుల విమర్శ...

**కలకడ ప్రజాసీమ:**

స్వప్రయోజనాల కోసం తరచూ రాజకీయ పార్టీలు మారుతూ, గతంలో వైయస్సార్సీపి పార్టీల్లో పదవులు అనుభవించిన వారు ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీపై విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదని వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షులు షావకత్తుల్లాఖాన్, పీలేరు నియోజకవర్గ అధ్యక్షులు కె.పి. సుబ్బారావు అన్నారు.కలకడ మాజీ సర్పంచ్ కుమారుడు దండు జిలానీబాష, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ సుల్తాని బాషలు వైఎస్సార్‌సీపీని వీడి, రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పి.వి. మిథున్‌రెడ్డిపై చేసిన విమర్శలు సమంజసం కాదని వారు పేర్కొన్నారు.వైఎస్సార్‌సీపీ హయాంలో ఎంపీగా పి.వి. మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషిని ప్రజలు గుర్తుంచుకున్నారని తెలిపారు.గతంలో వైఎస్సార్‌సీపీలో పదవులు పొంది పార్టీ ద్వారా రాజకీయ గుర్తింపు పొందిన వారు, ఇప్పుడు పార్టీ మారిన తర్వాత అదే పార్టీ నాయకులను విమర్శించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలు, రాజకీయ లబ్ధి కోసం పార్టీలు మారి, అనంతరం గతంలో పనిచేసిన నాయకులపైనే ఆరోపణలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.కలకడ ప్రాంతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించడంలో ఎంపీ పి.వి. మిథున్‌రెడ్డి సహకారం ఉందని వారు తెలిపారు.మైనారిటీ ప్రాంతాల్లో రహదారులు, ఇతర మౌలిక వసతుల కోసం నిధులు కేటాయించడంతో పాటు, మసీదు అభివృద్ధికి కూడా ఎంపీ తన వంతు సహకారం అందించారని పేర్కొన్నారు.ఇవన్నీ తెలియనట్లుగా ఎంపీ ఏమీ చేయలేదని విమర్శించడం తగదని హితవు పలికారు.ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిపై విమర్శలు చేసే ముందు గతంలో వారు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించాలని సూచించారు.రాజకీయ విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండాలని, వ్యక్తిగత ఆరోపణలకు దూరంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు షావలీలతఖాన్, అక్తర్‌బాష, రియాజ్ జిలాని, నద్దాహుస్సేన్ సద్దాం, సర్దార్ గౌరి మహమ్మద్, ముసా బాబు, ఖాదర్‌వల్లి తదితరులు పాల్గొన్నారు.



# గూడ్స్ రైలు ఢీకొని వృద్ధుడు మృతి

**కడప సెప్టెంబర్ 10 (ప్రజాసీమ):**



కడప రైల్వేస్టేషన్‌లో గురువారం ఉదయం విషాద ఘటన చోటుచేసుకుంది. కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం పి.ఆర్.పల్లి గ్రామానికి చెందిన డి.చిన్న నాగన్న (70) రైల్వే ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్న నాగన్న అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప రైల్వే ఎస్ఐ సునీల్ కుమార్ రెడ్డి తెలిపారు.

ప్రజాసీమ

# ఏ.ఆర్ మొబైల్స్ వారి ఆకర్షణీమైన పండుగ ఆఫర్లు

## - ప్రతి మొబైల్ కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతి
## - పాత మొబైల్ తీసుకురండి - కొత్త మొబైల్ తీసుకెళ్లండి
## - ఏ.ఆర్ మొబైల్స్ అధినేత నూర్ అజామ్ వెల్లడి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని బెంగళూరు బస్టాండ్ నందు గల ఏ.ఆర్ మొబైల్స్ వారు ఆకర్షణీయమైన పండుగ ఆఫర్లను ప్రకటించారు. ఈ సందర్భంగా ఏ.ఆర్ మొబైల్స్ అధినేత నూర్ అజామ్ మాట్లాడుతూ మా దుకాణంలో ప్రతి మొబైల్ కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతి ఉంటుందని రూ.10 వేలు విలువైన మొబైల్ ఫోన్ కొన్నవారికి 5 బహుమతులు,రూ.20 వేలు ఫోన్ కొన్నవారికి 10 బహుమతులు,రూ.30 వేలు మొబైల్ కొన్నవారికి 20 బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా అధిక ధరలకు మొబైల్ కొన్నవారికి ప్రత్యేక బహుమతుల కింద సైకిల్,డ్రెస్సింగ్ టేబుల్,డైనింగ్ టేబుల్ అప్పటికప్పుడే ఇస్తామన్నారు. ఇకపోతే మొబైల్ కొన్నవారికి కూపన్లు ఇచ్చి,లక్కీ డ్రా విజేతలకు రూ.రెండు లక్షల విలువైన స్కూటీ,రిఫ్రిజిరేటర్,వాషింగ్ మిషన్,టీవీ వంటి ఆకర్షణీయమైనా బహుమతులు అందజే యడం జరుగుతుందన్నారు. అంతేకా కుండా ఐఫోన్లు,ప్రధాన కంపెనీలకు సంబంధించిన మొబైల్ ఫోన్లు,ఫోన్లకు సంబంధించిన అన్నిరకాల పరికరాలు మా దుకాణంలో అందుబాటులో ఉన్నాయన్నారు. సామాన్య ప్రజలకు అతి తక్కువ ధరలకే అద్భుత ఫీచర్లతో కూడిన సెకండ్ హ్యాండ్ ఫోన్లు లభిస్తాయన్నారు .కొత్త ఫోన్లతోపాటు సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనుగోలు చేసిన వారికి బజాజ్ ఫైనాన్స్ సౌలభ్యం కలదన్నారు. ఎక్చేంజ్ ఆఫర్ కింద పాత మొబైల్ తీసుకొచ్చి కొత్త మొబైల్ తీసుకొని వెళ్లొచ్చన్నారు. అనుభవం కలిగిన సిబ్బంది చేత మొబైల్ ఫోన్ సర్వీసింగ్ వేగంగా చేసి ఇవ్వబడునన్నారు. ఈ ఆఫర్ దసరా వరకు ఉంటుందని తదనంతరం కొత్త ఆఫర్లు తీసుకొస్తామని ఆయన వెల్లడించారు. 20 సంవత్సరాలకుపైగా కస్టమర్ల నమ్మకానికి ఏఆర్ మొబైల్స్ ప్రతీకగా నిలిచిందన్నారు. మున్ముందు కస్టమర్ల నమ్మకాన్ని చూరగొంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా నియోజకవర్గ ప్రజలందరికీ ముందస్తు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని,ప్రజలంతా మట్టి వినాయకులను ఏర్పాటు చేసుకొని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. హిందూ,ముస్లింలు ఐకమత్యంగా వినాయక చవితి వేడుకలు జరుపుకొని మత సామరస్యాన్ని చాటాలని పిలుపునిచ్చారు.




# పర్యావరణహితం కోసం మట్టి వినాయకులని పూజిద్దాం

## - ఏపీఎస్ యుఎఫ్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన
## - అభినందించిన మదనపల్లె డీఎస్పీ బుజ్జిరాజు

**మదనపల్లె (ప్రజా సీము)**

: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏపీఎస్ యుఎఫ్ ఎన్జీఓ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మదనపల్లె డీఎస్పీ బుజ్జిరాజు పాల్గొని ప్రజలకు మట్టి వినాయక విగ్రహాల ప్రాముఖ్యతను వివరించారు. వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పిఓపి) విగ్రహాలకు బదులుగా పర్యావరణానికి అనుకూలమైన మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించాలని ప్రజలకు సూచించారు. పిఓపి విగ్రహాలు,రసాయన రంగుల వల్ల నీటివనరులు కలుషితమవడంతోపాటు పర్యావరణానికి నష్టం కలిగే ప్రమాదం ఉందని తెలిపారు. మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతోపాటు మన సంప్రదాయాలను కూడా పరిరక్షించవచ్చని ఏపీఎస్ యుఎఫ్ సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం డీఎస్పీ బుజ్జిరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములై మట్టి వినాయకుడిని పూజిద్దాం – పర్యావరణాన్ని కాపాడుదాం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఏపీఎస్ యుఎఫ్ స్వచ్ఛంధ సేవా సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ యుఎఫ్ ఎన్జీఓ వ్యవస్థాపకుడు ప్రణయ్,సభ్యులు సాయి మహేష్,సంతోష్,రెడ్డిబాషా,జయవర్ధన్,హరి తదితరులు పాల్గొన్నారు




# పుంగనూరులో టిడిపి భారీ ర్యాలీ!





## కార్యకర్తలకు నాయకులకు అండగా ఉంటాం ఎమ్మెల్యేలు!
## స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ జెండా ఎగురవేద్దాం!

**పుంగనూరు ప్రజాసీమ :**

పుంగనూరు టిడిపిలో కొత్త జోస్ కనబడుతుంది. పుంగనూరు నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ గా మధుసూదన్ నాయుడుని నియమించడంతో పార్టీ శ్రేణులు సంబరాలు లో మునిగిపోయారు. పట్టణం మొత్తం పసుపు మయముగా మారింది. నియోజకవర్గ బాధ్యతలు అప్పగించినందుకు మధుసూదన్ నాయుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయం నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. పట్టణంలో పార్టీ నాయకులకు కార్యకర్తలకు స్వాగతం పలుకుతూ ఎక్కడ చూసినా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ ర్యాలీ కోలాట లు , చెక్కభజనలు, కేరళ డ్రమ్ములు వాయిద్యాలు డీజేల నడుమ సాగింది . అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పుంగనూరులో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలోఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి , కిషోర్ కుమార్ రెడ్డి, షాజహాన్ భాష , తంబాలపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ శంకర్ యాదవ్, సుగవాసి ప్రసాద్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కార్యకర్తలకు నాయకులకు ఎటువంటి సమస్య వచ్చిన తాము ముందుండి పరిష్కరిస్తామని, రాబోయే మున్సిపాలిటీ, పంచాయితీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎన్నికలలో నాయకులు కార్యకర్తలు అందరం కలిసి సమన్వయంతో పనిచేసి పార్టీ జెండాను ఎగురవేద్దామన్నారు . నియోజకవర్గం ఇంచార్జ్ మధుసూదన్ నాయుడు మాట్లాడుతూ పార్టీ నాయకులు కార్యకర్తలు జోలికి ఎవరైనా వస్తే వారి తాటతీస్తాం అని, ఇప్పటివరకు ఒక లెక్క రేపటి నుంచి మరో లెక్క అని వ్యాఖ్యానించారు. రానున్న స్థానిక ఎన్నికలలో అందరం కలిసికట్టుగా పనిచేసి పార్టీ జెండాను ఎగుర వేద్దాం అన్నారు . ఈ కార్యక్రమంలో మధుసూదన్ రాయల్, సుబ్రమణ్యం రాజు, మోహన్ నాయుడు, విశ్రాంతి డిఎస్పి సుకుమార్ బాబు, జనసేన నాయకులు పట్టణ డి సి బి చైర్మన్ పగడాల రమణ రూరల్ మండల అధ్యక్షులు విరుపాక్షి, బాలాజీ నాయక్, హరి నాయక్ పెద్ద సంఖ్యలో టిడిపి జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రామాచార్లపల్లిలో వేడుకగా అయ్యప్పస్వామి పటం పూజ

## - హాజరైన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

నిమ్మనపల్లె రోడ్డు,రామాచార్లపల్లిలోని వీఆర్వో కత్తి నారాయణ నివాసంలో బుధవారం రాత్రి అయ్యప్ప స్వామి పటం పూజ ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ చినబాబు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలు ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకొని ప్రశాంతంగా జీవించాలని కోరుకున్నారు. పటం పూజ భక్తిశ్రద్ధలతో సాగిందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యాలగిరి దొరస్వామి నాయుడు,వేంపల్లి గురుస్వామి సూరి,లోకేష్,రఘు,గిరిధర్,శ్రీనివాసులు,అయ్యప్ప స్వామి భక్తులు,నిర్వాహకులు,స్థానికులు పాల్గొన్నారు.





# కొత్త పెన్షన్ల దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలి





## - సచివాలయ సిబ్బందికి ఎమ్మెల్యే ఆదేశం

**మదనపల్లె (ప్రజా సీమ) :**

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియలో భాగంగా ఒకటో వార్డు,రెండో వార్డు పరిధిలోని సచివాలయాలను మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి కార్యాలయంలో అందుబాటులో లేని సిబ్బంది పనితీరుపై మున్సిపల్ కమిషనర్ కు మెమో జారీ చేయాల్సిందిగా ఆదేశించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నేతలతో కలిసి సచివాలయాలలో కొత్త పెన్షన్ల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొత్త పెన్షన్లు ఇచ్చేందుకు సన్నద్ధమయ్యారని, ఈ నేపథ్యంలో సచివాలయ సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్హులైన పేదలందరికీ పెన్షన్లు ఇచ్చేందుకు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, వాటిల్లోని తెలుగుదేశం పార్టీ నేతలు వార్డులోని ప్రజల నుంచి వచ్చే విన్నపాలను అర్జీలను సంబంధిత సచివాలయ సిబ్బందితో కలిసి కొత్త పెన్షన్ల నమోదు కార్యక్రమంలో తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డు ఇంచార్జ్ రఘుపతి నాయుడు, శ్రీనివాసులు, యర్రబెల్లి వెంకటరమణారెడ్డి, మల్లికార్జున నాయుడు,డాన్స్ రెడ్డెప్ప,మంగల ప్రభాకర్,కాశీ శ్రీరామ్ వాల్మీకి,మా బాషా తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ స్కూల్ లో మహిళా బధ్రతపై అవగాహన

## - శక్తి యాప్, ఫోక్సో చట్టం, రోడ్డు బధ్రత నియమాలపై అవగాహన

**వేంపల్లె ప్రజాసీమ:**

స్థానిక నారాయణ పాఠశాలలో మహిళా బధ్రత, తదితర చట్టాలపై విధ్యార్థులకు వేంపల్లె సీఐ టి.నరసింహులు అవగాహన కల్పించారు. గురువారం ఆ పాఠశాల ఆవరణలో శక్తి యాప్, ఫోక్సో చట్టం, డయల్ 112, సైబర్ నేరాలు, రోడ్డు బధ్రత నియమాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థ మహిళల రక్షణకు, బధ్రతకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఆపద సమయంలో పోలీస్ రక్షణకు డయల్ 112 వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా బధ్రతకు శక్తి యాప్ ఒక రక్షక కవచంలా ఉపయోగ పడుతుందని వెల్లడించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వీటి నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. బాలలపై లైంగిక వేధింపుల నిరోధానిక పోక్సో చట్టంపై స్పష్టంగా వివరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తత ఎంతో అవసరమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు నియమాలు తప్పనిసరిగా పాటించాలని తగిన సలహాలు సూచనలు చేశారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తున్నాయని, వీటికి దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కె.నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# స్మార్ట్ కిచెన్ సెంటర్లో మధ్యాహ్న భోజనం ట్రయిల్ రన్

## సిద్దవటం ఎంపీడీఓ ఫణి రాజకుమారి

**సిద్దవటం( ప్రజా సీమ)**



స్మార్ట్ కిచెన్ సెంటర్లో మధ్యాహ్న భోజనం ట్రయిల్ రన్ నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సిద్దవటం ఎంపీడీఓ ఫణి రాజకుమారి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ స్మార్ట్ కిచెన్ సెంటర్ నుంచి వివిధ పాఠశాలలకు తీసుకెళ్లే మధ్యాహ్న భోజనం నాణ్యతను, రుచిని పరిశీలించడం జరుగుతుందన్నారు. రుచికరమైన భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మెహెతాబ్ యాస్మిన్, ఏఓ సోమశేఖర్, పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గురు ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి యాకూబ్, మాజీ సర్పంచ్ ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.



# రాజంపేటలో గంజాయి స్వాధీనం

## ముగ్గురు అరెస్ట్

### 1.3 కిలోల ఎండు గంజాయి, మూడు సెల్‌ఫోన్లు సీజ్

రాజంపేట (ప్రజా సీమ):

రాజంపేటలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను ఎక్సైజ్ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి సుమారు 1.3 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని, మూడు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. గురువారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పద్మావతి ఆధ్వర్యంలో రాజంపేట ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా మెరుపు దాడి నిర్వహించారు. గంజాయి విక్రయిస్తున్న నిందితులు కిచ్చగారి నిరంజన్ (20), షేక్ అమీర్ ఆష్రూజ్ (24), కోటపాటి వినయ్ (24) లను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ పద్మావతి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.





# సైబర్ సెక్యూరిటీ,ఎథికల్ హ్యాకింగ్‌పై మిట్స్‌లో అవగాహన సదస్సు

## - హాజరైన నలేమ్టన్ ఇన్ఫోటెక్ సంస్థ సీఈఓ నలేమ్టన్





మదనపల్లె (ప్రజా సీమ) :

మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్) విభాగం వారు విద్యార్థుల కోసం గురువారం సైబర్ సెక్యూరిటీ మరియు ఎథికల్ హ్యాకింగ్ పై ఒక్కరోజు సెమినార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నైకు చెందిన నలేమ్టన్ ఇన్ఫోటెక్ సంస్థ,ఫౌండర్ మరియు సీఈఓ నలేమ్టన్.ఎస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి డిజిటల్ ప్రపంచంలో పెరుగుతున్న సైబర్ నేరాలను ఎదుర్కొనే లక్ష్యంతో సైబర్ సెక్యూరిటీ మరియు ఎథికల్ హ్యాకింగ్ పై అవగాహన ఎంతో కీలకమైందన్నారు. సంస్థల డేటా,కంప్యూటర్ సిస్టమ్‌లు మరియు నెట్‌వర్క్‌లను సురక్షితంగా ఉంచేందుకు అనుసరించాల్సిన విధానాలు,ఆధునిక సైబర్ సెక్యూరిటీ టూల్స్,మెథడాలజీల వినియోగంపై విద్యార్థులకు పరిశ్రమ ఆధారిత అవగాహన కల్పించారు. ఎథికల్ హ్యాకింగ్, పెనిట్రేషన్ టెస్టింగ్ ద్వారా సిస్టమ్‌లలోని భద్రతా లోపాలను ముందుగానే గుర్తించి,సైబర్ దాడులు జరగకుండా అవసరమైన రక్షణ చర్యలు చేపట్టవచ్చునన్నారు .నెట్‌వర్క్ సెక్యూరిటీ,సైబర్ థ్రెట్లు,మాల్వేర్,ఫిషింగ్ దాడులు,డేటా సెక్యూరిటీ తదితర అంశాలతోపాటు ఆధునిక సైబర్ సెక్యూరిటీ టూల్స్ మరియు వాటి వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్,ఎథికల్ హ్యాకింగ్ మరియు సైబర్ సెక్యూరిటీ సమన్వయం భవిష్యత్ డిజిటల్ భద్రతలో కీలక పాత్ర పోషించనుందన్నారు. ఏ.ఐ ఆధారిత సెక్యూరిటీ టూల్స్‌పై అవగాహనతో పాటు నైతిక విలువలు,చట్టపరమైన పరిమితులు మరియు బాధ్యతాయుతమైన సైబర్ ప్రాక్టీసులను విద్యార్థులు అభివృద్ధి చేసుకోవడం అత్యంత అవసరమన్నారు. సైబర్ సెక్యూరిటీపై సాంకేతిక పరిజ్ఞానం,ప్రాక్టికల్ నైపుణ్యాలు కలిగిన విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కంపెనీలు,బ్యాంకింగ్ రంగం,ప్రభుత్వ సంస్థలు,డిఫెన్స్,ఐటీ తదితర రంగాల్లో విస్తృతమైన ఉద్యోగ,కెరీర్ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఎస్.కుసుమ,కో-ఆర్డినేటర్ ఆరోక్యరాజ్.ఎ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# 17వ వార్డులో డ్రైనేజీ పనులకు శ్రీకారం





## పత్రికల్లో కథనాలకు స్పందచి .. పనులు ప్రారంభం.

కాకినాడ జిల్లా ప్రజా సీమ

గొల్లప్రోలు సెప్టెంబర్ 10 ( పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో గొల్లప్రోలు పట్టణంలోని 17వ వార్డు శివాలయం మన్యం ప్రాంతంలో డ్రైనేజీ పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. మున్సిపల్ కమిషనర్ దివిజ సంపతి సహకారంతో పనులు ప్రారంభించినట్లు వార్డు ఇన్‌చార్జి మొగలి రాజా తెలిపారు. వార్డులో చాలాకాలంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. పనులు పూర్తయితే మురుగునీటి సమస్య తొలగడంతో పాటు పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడతాయని తెలిపారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మున్సిపల్ కమిషనర్ దివిజ సంపతికి కృతజ్ఞతలు తెలిపారు. కథనాలతో కదిలిన అధికారులు17వ వార్డులో రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై ఆగస్టు 15న వివిధ పత్రికల్లో ప్రచురితమైన కథనాలకు స్పందన లభించిందని స్థానిక మహిళలు తెలిపారు. సమస్యను గుర్తించి డ్రైనేజీ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్న కమిషనర్ దివిజ సంపతికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

## - పీస్ కమిటీ సమావేశంలో డీఎస్పీ మురళీ నాయక్

వేంపల్లె ప్రజాసీమ:

ఈనెల 14 నుంచి గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకుని, పోలిసులకు సహకరించాలని పులివెందుల డిఎస్పి మురళీ నాయక్ కోరారు. గురువారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు, ప్రజలు అప్రమత్తంగా.. ప్రశాంత వాతావరణంలో వేడుకలను నిర్వహించు కోవాలన్నారు. అలాగే జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ప్రజల ఆరోగ్య బద్రత దృష్ట్యా డీజేలు, సౌండ్ పొల్యూషన్ లేకుండా నియంత్రించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా మత సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించు కోవాలని సూచించారు. గణేష్ విగ్రహాల ప్రతిష్ట, ఊరేగింపు, నిమజ్జనం పోలిసుల సూచనలు, నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. శాంతి బద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడ వద్దని, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ నరసింహులు, ఎస్సై తిరుపాల్ నాయక్, పీస్ కమిటీ సభ్యులు, గణేష్ ఉత్సవాల నిర్వాహకులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.




# చెరువుల అభివృద్ధి పనుల పరిశీలన





## --నెలాఖరులోగా పూర్తి చేయాలి

కాకినాడ జిల్లా (ప్రజా సీమ )

గొల్లప్రోలు మండలంలో ప్రధానమంత్రి కృషి సించాయి యోజన ‾ 2.0) కింద చేపట్టిన చెరువుల అభివృద్ధి పనులను చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ బి.గోపీచంద్, పాడా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.శివరామ ప్రసాద్ గురువారం పరిశీలించారు. పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్ణీత ప్రమాణాల మేరకు పనులు చేపట్టి నెలాఖరులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. వన్నెపూడి, దుర్గాడ మంచినీటి చెరువులతో పాటు ఏపీ మల్లవరం, ఏకే మల్లవరం, చేబ్రోలు, కోటలంక ప్రాంతాల్లోని చెరువులను వారు పరిశీలించారు. చెరువుల అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేస్తున్న వాకింగ్ ట్రాక్‌లు, బెంచీలు, చిన్నారుల పార్కులు, ఓపెన్ జిమ్‌లు, సౌర విద్యుత్ దీపాలు తదితర పనుల నాణ్యతను పరిశీలించారు. ప్రజలకు ఉపయోగపడేలా పనులను వేగవంతం చేయాలని సూచించారు .కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.వసంత మాధవ్, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ బి.జ్యోతిబాబు, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ ఎం.బాలాజీ, అదనపు ప్రోగ్రామ్ అధికారి బెజవాడ సత్యనారాయణ, సాంకేతిక, క్షేత్ర సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, జనసేన మండల అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్, పి.తమ్మారావు, చిన్న భాస్కర్‌రెడ్డి, తడవర్తి చక్రరావు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# మోటార్ సైకిళ్ల దొంగతనం కేసులో ఇద్దరికి 11 నెలల జైలు

## --రూ.500 జరిమానా విధించిన పిఠాపురం కోర్టు

కాకినాడ జిల్లా ప్రజా సీమ

గొల్లప్రోలు మోటార్ సైకిళ్ల దొంగతనం కేసులో ఇద్దరు నిందితులకు పిఠాపురం జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీమతి వెంకట అపర్ణ 11 నెలల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 500 జరిమానా విధించారు. గొల్లప్రోలు శివాలయం వద్ద 2026 ఫిబ్రవరి 18న నమోదైన క్రైం నంబర్ 44/2026, సెక్షన్ 303(2) బీఎన్ఎస్ కేసులో విత్తనాల దుర్గ ప్రసాద్ (39), మజ్జి నరేంద్రకుమార్ (34)లను పోలీసులు అరెస్టు చేశారు. కేసు విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో కోర్టు శిక్ష విధించింది. ప్రభుత్వం తరఫున ఇన్‌చార్జి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీమతి ఆకుల లీలా నాగరోజా, డి. నాగరాజు వాదనలు వినిపించారు. కేసు పర్యవేక్షణలో పిఠాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్. రామకృష్ణ కీలకంగా వ్యవహరించారు. నిందితులను సకాలంలో కోర్టుకు హాజరుపరచడంలో విశేష కృషి చేసిన కోర్టు కానిస్టేబుల్ వై. లచ్చిబాబును పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.



# గొల్లప్రోలు 23 వార్డుల పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శన

కాకినాడ జిల్లా (ప్రజా సీమ )

గొల్లప్రోలు పురపాలక సంఘం పరిధిలోని 23 వార్డులకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల జాబితాను అధికారులు ప్రదర్శించనున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం, విజయవాడ వారి ఆదేశాల మేరకు ఈ జాబితాను సిద్ధం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. గొల్లప్రోలు మున్సిపాలిటీ పరిధిలోని 1 నుంచి 23 వార్డులకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల జాబితాను సెప్టెంబర్ 10వ తేదీన మున్సిపల్ కార్యాలయం నోటీసు బోర్డుతో పాటు కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, గ్రంథాలయం తదితర కార్యాలయాల్లో ఎగ్జిబిట్--1 రూపంలో ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. జాబితాపై ప్రజల నుంచి ఏవైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే సెప్టెంబర్ 11వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా గొల్లప్రోలు మున్సిపల్ కార్యాలయానికి లిఖితపూర్వకంగా అందజేయాలని అధికారులు సూచించారు. ౕత గడువు అనంతరం వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు.



ప్రజాసీమ

# ఐఎన్జీ వైశ్యా బ్యాంకు రమణ సేవలు అభినందనీయం

## - మైఫోర్స్ మహేష్,డాక్టర్ ఎన్.మునిగోపాలకృష్ణ ప్రశంసలు

## - కొత్తిండ్లు పాఠశాల విద్యార్థులకు విద్యాసామాగ్రి వితరణ





**మదనపల్లె (ప్రజా సీమ) :**

విద్యార్థులు ఇష్టంగా కష్టపడి చదివి ప్రయోజకులు కావాలని విశ్రాంత వైశ్య బ్యాంకు ఉద్యోగి రమణ ఆకాంక్షించారు.గురువారం మదనపల్లె మండలం కొత్తఇండ్లు మండల పరిషత్ ప్రాథమి కోన్నత పాఠశాల నందు విద్యార్థులకు పలకలు,ఎక్కాల పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీఎండిసీ స్టేట్ డైరెక్టర్,జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్,సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.మునిగోపాల కృష్ణలు హాజరయ్యారు.ఇందులో భాగంగా పాఠశాలకు వచ్చిన దాతను,అతిథులను హెచ్ఎం గుల్జార్,ఉపాధ్యాయులు గురుప్రసాద్ సాదర స్వాగతం పలికారు.ఈ సందర్భంగా డా.ఎన్ మునిగోపాల కృష్ణ మాట్లాడుతూ విశ్రాంత జీవితంలో కూడా వైశ్య బ్యాంక్ రమణ మానవసేవ కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా సామాగ్రిని సమకూర్చడం గర్వకారణ మన్నారు. దశాబ్ద కాలానికిపైగా రమణ అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు.డాక్టర్ మైఫోర్స్ మహేష్ మాట్లాడుతూ కొత్తఇండ్లు ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను సమకూర్చడానికిగాను విద్యాశాఖ మంత్రికి సమస్యలను తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.వైశ్య బ్యాంక్ రమణ చేస్తున్న సేవలు అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు విద్యాభివృద్ధికి అందించాలని కోరారు.విద్యాసామాగ్రి అందించిన దాత వైశ్య బ్యాంక్ రమణ మాట్లాడుతూ ఇటీవలే విద్యార్థుల అవసరాలను గుర్తించి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ,రానున్న మూడు నెలల వ్యవధిలో విద్యార్థులందరికీ కావాల్సినవి సమకూర్చేందుకు తిరిగి మీ ముందుకు వస్తానని ప్రకటించారు.తాను 2008 నుంచి అనేక విధాలుగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు.ముఖ్యంగా విద్యార్థులు కష్టపడి ఇష్టంగా చదివినప్పుడు మంచి భవిష్యత్తును అందుకుం టారని కావున ఆవిధంగా ముందుకెళ్లాలని కోరారు.అనంతరం విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు.పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందజేసిన దాత వైశ్య బ్యాంకు రమణ,హాజరైన మైఫోర్స్ మహేష్,డాక్టర్ మునిగోపాల కృష్ణలను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఇంచార్జ్ హెచ్ఎం సతీష్,ఉపాధ్యా యులు గురుప్రసాద్ ,నరసింహారెడ్డి,గీతా వరలక్ష్మితోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# రూ.7 కోసం పోరాటం.. రూ.7 లక్షలు!

## -అన్నవరం దేవస్థానం షాపుపై వినియోగదారుడి న్యాయపోరాటం.. కమిషన్ కీలక తీర్పు

**కాకినాడ జిల్లా (ప్రజా సీమ )**



అన్నవరం, :రూ.7 అధికంగా వసూలు చేశారంటూ ఓ భక్తుడు చేసిన న్యాయపోరాటం చివరకు రూ.7 లక్షలు వినియోగదారుల సంక్షేమ నిధికి చేరేలా చేసింది. అన్నవరం దేవస్థానం కొండపై వాటర్ బాటిల్‌ను ఎంఆర్పీ కంటే అధిక ధరకు విక్రయిం చడంపై డి. వెంకటేశ్వరరావు వినియోగ దారుల న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ అనంతరం ఈస్ట్ గోదావరి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఆగస్టు 28న తీర్పు వెలువరించింది.ఎంఆర్పీ కంటే అదనంగా వసూలు చేసిన రూ.7ను తిరిగి చెల్లించడంతో పాటు, లిటిగేషన్ ఖర్చుల కింద రూ.10 వేలు చెల్లించాలని కమిషన్ ఆదేశించింది. అంతేకాకుండా రూ.7 లక్షలను కన్స్యూమర్ వెల్ఫేర్ ఫండ్‌కు జమ చేయాలని స్పష్టం చేసింది.దేవస్థానం పరిధిలోని లైసెన్స్ పొందిన అన్ని దుకాణాల్లో వస్తువుల ఎంఆర్పీని స్పష్టంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని దేవస్థానాన్ని ఆదేశించింది. భక్తులకు ఎంఆర్పీ తదితర వివరాలపై ప్రకటనలు, అవగాహన కల్పించాలని సూచించింది.భక్తుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తే ప్రశ్నించాల్సిందేనని వెంకటేశ్వరరావు అన్నారు. వినియోగదారుల హక్కుల కోసం చివరి వరకు పోరాడితే న్యాయం గెలుస్తుందన్నారు. రూ.7 కోసం ప్రారంభమైన పోరాటం రూ.7 లక్షలు వినియోగదారుల సంక్షేమ నిధికి చేరేలా చేయడం విశేషం.గమనిక: తీర్పు కాపీలో రూ.7 లక్షలను 'జరిమానా'గా కాకుండా కన్స్యూమర్ వెల్ఫేర్ ఫండ్‌కు చెల్లించాల్సిన మొత్తంగా పేర్కొన్నారు.

# అనారోగ్య బాధితులకు అండగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు

## 34 కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ ఫండ్ నిధులు అందజేసిన ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి...

**పీలేరు ప్రజసీమ :**



ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సీఎంఆర్ఎఫ్ పేద కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తుందని నిరూపించారు. కష్టాల్లో ప్రభుత్వం అండగా ఉండాలన్న ఆలోచనతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఆపదలో ఉన్న కుటుంబాలకు భరోసాగా నిలుస్తుందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి గారు అన్నారు.కలికిరి మండలం నగిరిపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద పీలేరు నియోజకవర్గ వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 34 మంది బాధిత కుటుంబాలకు 26లక్షల 74వేల 288 రూపాల చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి సీఎంఆర్ఎఫ్ ద్వారా తక్షణ సహాయం అందిస్తున్నారని తెలిపారు.పీలేరు నియోజకవర్గంలో ఎవరూ అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో తాను చొరవ తీసుకుని సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు చేయిస్తున్నానని, గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేదని, కానీ కూటమి ప్రభుత్వంలో వారం రోజుల్లోనే చెక్కులు మంజూరు అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యమే తమ ప్రభుత్వ ధ్యేయమని, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని,ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,కూటమి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న బాధిత కుటుంబాలు ఎమ్మెల్యేకి, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# సిద్ధవటం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ తరలింపు ఆపండి

## డిప్యూటీ కమిషనర్ కు వినతి

## మండల జేఏసీ అధ్యక్షులు

## బండారు రాజగోపాలయ్య

**సిద్ధవటం ప్రజా సీమ**

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఒంటిమిట్ట మండలానికి తరలింపు నిలుపుదల చేయాలని సిద్ధవటం మండల జేఏసీ సభ్యులు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజుకు తన కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా మండల జేఏసీ అధ్యక్షులు బండారు రాజగోపాలయ్య మండల కేంద్రమైన సిద్ధవటంలో గురువారం మాట్లాడుతూ ప్రహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఒంటిమిట్టకు బదలాయింపు నిలుపుదల చేయాలని డిప్యూటీ కమిషనర్ జయరాజుకు కడప నగరంలోని తన కార్యాలయంలో వినతి పత్రం సమర్పించామని 1964 నుండి సిద్ధవటం కేంద్రంగా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ అట్లూరు సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల సిద్ధవటం తాలూకా కేంద్రం నుండి కార్యకలాపాలు జరుగుతున్నాయని సిద్ధవటం లో కోర్టు, ఉప ఖజానా , రిజిస్టర్, రెవెన్యూ, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ, గత 50 సంవత్సరాలుగా కార్యాలయాల పాలన కొనసాగుతుందని, 2014లో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణానికి రంగనాథ స్వామి కోవెల సమీపాన సర్వే నెంబర్ 51 లో, 6 సెంట్లు స్థలాన్ని రెవిన్యూ అధికారులు నిర్ధారణ చేశారని, ఒంటిమిట్టకు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ బదిలాయింపు నిలుపుదల చేయాలని లేనిపక్షంలో మండల జేఏసీ తరుపున ఉద్యమం తప్పదని మండల జేఏసీ అధ్యక్షులు రాజ గోపాలయ్య తెలిపారు ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యుదురిటైర్డ్ ఎంఈఓ నారాయణ పాల్గొన్నారు



# అక్రమంగా తరలిస్తున్న 12 ఎద్దులు స్వాధీనం

## -నలుగురు వ్యక్తుల అరెస్టు.. నాలుగు బొలెరో వాహనాలు సీజ్





**కాకినాడ జిల్లాప్రజా సీమ**

గొల్లప్రోలుఅక్రమంగా పశువులను తరలిస్తున్న నాలుగు బొలెరో వాహనాలను గొల్లప్రోలు పోలీసులు గురువారం ఉదయం పట్టుకున్నారు. వాహనాల్లో మొత్తం 12 ఎద్దులను బాధ, వేదన కలిగే విధంగా అసౌకర్యంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.గొల్లప్రోలు ఎస్ఐ ఎన్. రామకృష్ణకు అందిన సమాచారంతో సిబ్బందితో కలిసి ఉదయం 6 గంటల సమయంలో జాతీయ రహదారి-16పై కొత్త వజ్రకూటం గ్రామ సమీపంలోని వజ్రకూటం జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఉదయం 6.30 గంటల సమయంలో కత్తిపూడి వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న నాలుగు బొలెరో వాహనాలను ఆపి తనిఖీ చేయగా ఒక్కో వాహనంలో మూడు చొప్పున మొత్తం 12 ఎద్దులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు.ఈ వ్యవహారంలో విజయనగరం జిల్లా అలమండ గ్రామానికి చెందిన ఇప్పిలి సురేష్ (30), పైలా వాసు (26), గవర ప్రసాద్ (35), శ్రీకాకుళం గుజరాతీపేటకు చెందిన ఉన్నకుల శ్రీను (40)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఎద్దులను విజయనగరం జిల్లా అలమండ గ్రామం నుంచి కృష్ణా జిల్లా కోసూరు గ్రామానికి తరలిస్తున్నట్లు వారు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.12 ఎద్దులతో పాటు నాలుగు బొలెరో వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పశువులను సంరక్షణ నిమిత్తం గోశాలకు తరలించారు. కేసుపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు

# రీ-సర్వే విధానంతో రైతులకు ఇబ్బందులు

## - క్షేత్రస్థాయిలో పకడ్బందీగా రీసర్వే నిర్వహించాలి

## - అధికారులకు కాంగ్రెస్ నేత రాజశేఖర్ నాయక్ విజ్ఞప్తి

**మదనపల్లె (ప్రజా సీమ) :**



క్షేత్రస్థాయిలో భూసమస్యలను పరిష్కరించేందుకు ఏపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీ-సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని,అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.రీసర్వే విధానంపై గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుక్యా రాజశేఖర్ నాయక్ మాట్లాడుతూ ఈ విధానం అన్నదాతలకు సరికొత్త సమస ్యలను తెచ్చిపెడుతోందన్నారు .పాతరికార్డులు పరంగా కాకుండా,ప్రస్తుత రికార్డులు ఆధారంగా సర్వే చేస్తుండడంతో భూముల సరిహద్దులు మారిపోతూ గందరగోళానికి గురి చేస్తోందన్నారు.అన్నమయ్య జిల్లాలో సాధారణంగా భూ సమస్యలు అధికమని,ముఖ్యంగా మదనపల్లి డివిజనులో అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు.కొంతమంది రెవెన్యూ అధికారులు,సర్వేయర్లు అవగాహన లోపంతో సమస్యలు ఏర్పడుతున్నాయని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్లు,ఇతర ఉన్నత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నప్పటికీ రీసర్వే సమస్యను అధికమించలేకపోతున్నారు.రీసర్వే కారణంగా అసలు భూమి ఒకరిదయితే మరొకరి పేరుతో రికార్డులు వస్తున్నాయని,దీంతో రైతులు మధ్య సమస్యలు పెరిగిపోవడమే కాకుండా కొత్త భూసమస్యలు తలెత్తుతున్నాయన్నారు.కావున అధికారులు దీనిపై ప్రభుత్వం పునఃపరిశీలించి అధికారులు పాత రికార్డు ప్రకారమే సర్వేలు నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఇప్పటికైనా ఒక స్పష్టమైన ప్రణాళికతో ఈ సర్వేలను నిర్వహించి భూ సమస్యలకు చెక్ పెట్టాలని ఆయన వెల్లడించారు.

# పిఠాపురం దత్త ఉపాసకులు లక్ష్మీ నారాయణ దత్త స్వామికి ఘన సత్కారం

**పిఠాపురం (ప్రజా సీమ )**

పిఠాపురానికి చెందిన ప్రముఖ దత్త ఉపాసకులు, లక్ష్మీ నారాయణ దత్త స్వామికి దేశ రాజధాని న్యూఢిల్లీలో ఘన సత్కారం జరిగింది. కేంద్ర సమాచార కమిషనర్ (సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషనర్) చేతుల మీదుగా ఈ సత్కార కార్యక్రమం ఇటీవల అత్యంత వైభవంగా నిర్వహించారు.దత్తాత్రేయ స్వామి వారి తత్వాన్ని, విశిష్టతను విశేషంగా ప్రచారం చేయడంతో పాటు, పిఠాపురం పుణ్యక్షేత్రం యొక్క మహత్యాన్ని రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా అందరికీ తెలియజేస్తూ ఆయన చేస్తున్న ఆధ్యాత్మిక సేవలను గుర్తిస్తూ ఈ గౌరవం లభించింది. స్వామి వారి నిరంతర దత్త సేవా తత్పరతకు గానూ ఈ సత్కారం అంకితం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని లక్ష్మీ నారాయణ దత్త స్వామి అభినందించారు.



ప్రజాసేవ

# సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన స్వగత కృష్ణన్



తమిళ సినీ పరిశ్రమలో ఓ పోస్ట్ చర్చనీయంగా మారింది. ప్రముఖ గాయని స్వగత కృష్ణన్ చేసిన తాజా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పేరు ప్రస్తావించకుండా ఓ వ్యక్తిపై ఆమె సంచలన ఆరోపణలు చేసింది. ఆ వ్యక్తి మహిళలపై లైంగిక దాడులు, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్, బలవంతపు మత మార్పిడి చేశాడని, అలాంటి వ్యక్తికి ఇండస్ట్రీ కి సపోర్టుగా నిలిచిందని అసంతృప్తి వ్యక్తం చేసింది.సింగర్ స్వగత కృష్ణన్ గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తనకు ఎదురైన చేదు అనుభవాలను వెల్లడించింది. ఓ సంగీత దర్శకుడి స్టూడియోలో తనను లైంగిక వేధించాడనీ, స్టూడియోలో సౌండ్‌ప్రూఫ్ గది, సీసీటీవీ కెమెరాలు ఉన్నాయని.. అక్కడ జరిగిన ఘటనను రికార్డు చేసి, ఆ ఫుటేజ్‌ను ఉపయోగించి తనను బెదిరించారని ఆమె పేర్కొన్నారు. తనకు మాత్రమే కాకుండా మరికొంతమంది మహిళలకు కూడా ఇదే వ్యక్తి వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయని స్వగత ఆరోపించారు. ఈ పరిణామాల కారణంగానే తాను చెన్నైని విడిచి రిషికేశ్‌కు వెళ్లినట్లు వెల్లడించారు. ఇప్పుడు స్వగత చేసిన తాజా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీతో ఆ వ్యవహారం మరోసారి చర్చలోకి వచ్చింది. పేరు చెప్పకుండా ఓ వ్యక్తిపై సంచలన ఆరోపణలు చేసింది. పలువురు బాధిత మహిళలు ఆరోపణలు చేసినప్పటికీ ఆ వ్యక్తికి సినీ పరిశ్రమలో మద్దతు లభిస్తుంది. ఆ వ్యక్తి ప్రస్తుతం తన సామాజిక ప్రతిష్ట, పీఆర్, ప్రజాభిప్రాయం గురించి ఇంటర్వ్యూలు ఇస్తుండటం ఎలా సాధ్యమవుతోందని ఆమె ప్రశ్నించారు. ఒకవైపు ఇలాంటి ఆరోపణలు ఉండగా.. మరోవైపు పరిశ్రమలో అతడికి గౌరవం, స్వాగతం లభిస్తుండటంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేసింది. స్వగత తాజా పోస్టులో మరో కీలక విషయాన్ని ప్రస్తావించింది. ఆ వ్యక్తి ప్రస్తుతం ఓ భక్తి ప్రధానమైన సినిమాకు సంగీతం అందిస్తున్నారని తెలిపింది. ఈ ఒక్క అంశం సోషల్ మీడియాలో చర్చకు మరింత ఆజ్యం పోసింది. అంతే కాదు.. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని బహిరంగ కార్యక్రమాలకు ఆహ్వానించడం, వేదికపై అతడికి కేక్ తినిపిస్తున్నారనీ తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో సినీ పరిశ్రమ ఎవరి పక్షాన నిలబడుతుందనీ ప్రశ్నించింది. ఇక చివరిలో 'నెక్స్ట్..' అంటూ తన ట్వీట్ ముగించింది సింగర్ స్వగత. ఇలాంటి ఉత్కంఠ రేపడంతో త్వరలో మరిన్ని వివరాలను వెల్లడించబోతున్నారా? ఇప్పటివరకు చెప్పని విషయాలను బయటపెట్టబోతున్నారా? అనే చర్చ మొదలైంది. ఇప్పటికే ఆమె గత ఆరోపణలపై కూడా సోషల్ మీడియాలో చర్చ జరిగిన నేపథ్యంలో.. తాజా పోస్టు మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ఆమె తదుపరి పోస్టులో ఏదైనా వ్యక్తి పేరు లేదా కీలక ఆధారం బయటపెడతారా అన్నదే ఇప్పుడు ఉత్కంఠగా మారింది.

# ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ మూవీ మండాడి

సూరి, సుహాస్ మెయిన్ లీడ్స్ గా తెరకెక్కిన తమిళ్ సినిమా 'మండాడి'. ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్ పై ఎల్రెడ్ కుమార్ నిర్మాణంలో మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. ఈ సినిమాలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటించగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్.. పలువురు కీలక పాత్రలను పోషించారు. మండాడి సినిమా నేడు సెప్టెంబర్ 10న తమిళ్, తెలుగులో రిలీజ్ అయింది. కళింగపట్నంను సట్టపులి(సుహాస్) రూల్ చేస్తూ ఉంటాడు. ఆ ఊళ్ళో సముద్రంలో జరిగే పడవపోటీలు ఎన్నో ఏళ్లుగా చాలా ఫేమస్. 20 ఏళ్లుగా సట్టపులి సునామి రైడర్స్ టీమ్ తో ఆ ఊరిని గెలిపిస్తూ ఉంటాడు. శ్రీను(రవీంద్ర విజయ్) కొడుకు మల్లేష్(మిథున్ జై శంకర్) పడవల పోటీకి సంబంధించిన ఓ విషయంలో గొడవ జరిగి సట్టపులి కొడుకుపై దాడి చేస్తాడు. అది మిస్ అవ్వడంతో ఓ అమ్మాయి సాయంతో హైదరాబాద్ లో ఉన్న ముత్తు కాళీ(సూరి) దగ్గర తలదాచుకుని ఉంటాడు. ముత్తుకాళీ పెళ్లి చేసుకోకుండా సింగిల్ గా ఉంటూ ఓ స్విమ్మింగ్ పూల్ లో పనిచేస్తూ ఉంటాడు. కానీ సట్టపులి మనుషులు మల్లేష్ ని చంపడానికి అక్కడికి కూడా రావడంతో 20 ఏళ్లుగా ఊరికి వెళ్లని ముత్తుకాళీ మల్లేష్ ని తీసుకొని ఊరికి వస్తాడు. అక్కడ పెద్దలు సట్టపులికి ముత్తుకాళీ మధ్య రాజి కుదర్చాలని ట్రై చేసినా అక్కడ పెద్ద గొడవ అవుతుంది. దాంతో కళింగపట్నం నుంచి రెండు టీమ్స్ పోటీ చేయాలి ఎవరు ఓడిపోతే వాళ్ళు ఆటని వదిలేయాలి అని నిర్ణయిస్తారు. పోటీకి కొన్ని రోజులు సమయం ఉండటంతో కొత్తవాళ్లకు ముత్తుకాళీ తన కళింగ వారియర్స్ టీమ్ గా ట్రైనింగ్ ఇస్తూ ఉంటాడు. సట్టపులి, అతని కొడుకు పోటీ ఎలాగైనా గెలవాలని కుట్రలు పన్నుతూ ఉంటారు. ఓ ప్రాక్టీస్ మ్యాచ్ లో ముత్తుకాళీ టీమ్ పడవ బోల్తా పడి పోటీలో ఉన్నవాళ్లు హాస్పిటల్ పాలవుతారు. దీంతో కళింగ వారియర్స్ కి పోటీల్లో ఎలా పాల్గొనాలో అర్థం కాదు. మరోవైపు 20 ఏళ్ళ క్రితం ముత్తుకాళీ ఒకప్పుడు తన తల్లి ఏంజిల్ (మహిమా నంబియార్)ని ప్రేమించిన వ్యక్తి అని తెలిసి మల్లేష్ ముత్తుకాళీ పై కోపంగా ఉంటాడు. అసలు 20 ఏళ్ళ క్రితం ఆ ఊళ్ళో ఏం జరిగింది? బెస్ట్ ఫ్రెండ్స్ గా ఉండే సట్టపులి -- ముత్తుకాళీ శత్రువులు ఎలా అయ్యారు? ఏంజిల్ -- ముత్తుకాళీ ప్రేమ ఎందుకు విఫలమైంది? పోటీలో గెలవడానికి సట్టపులి చేసే కుట్రలు ఏంటి? ఫైనల్ పోటీలో ముత్తుకాళీ టీమ్ గెలుస్తుందా? సముద్రంలో జరిగే సంఘటనలు ఏంటి.. ఇవన్నీ తెలియాలంటే తెరపై చూడాల్సిందే.




# స్టైల్‌ని బాగానే వాడేశారు

కంటెంట్ ఉన్నోడికి కటౌట్ చాలు.. ఈ సినిమా డైలాగ్‌ను సినిమాలకే ఆపాదిస్తే.. 'కంటెంట్ మీద నమ్మకం తక్కువ ఉన్నప్పుడు కాంట్రవర్సీ చాలు' అని మార్చొచ్చు. ఇది ఏ ఒకరినో ఉద్దేశించి అన్న మాట కాదు. ఇప్పటివరకు టాలీవుడ్‌లో జరిగిన సినిమా కాంట్రవర్శీలు, ఆ తర్వాత ఆ సినిమాలు పొందిన లాభాలు చూసి అన్నమాట ఇది. ఇక్కడ పేర్లు చెప్పం కానీ.. యువ హీరోలు.. యువ స్టార్ హీరోలు, యువ ప్రామిసింగ్ హీరోలుగా మారడానికి ఈ స్టైల్‌ని బాగానే వాడేశారు. ఇప్పుడు ఎందుకు ఈ చర్చ అనుకుంటున్నారా? ఇప్పుడు టాలీవుడ్‌లో రిలీజ్‌కి రెడీ అవుతున్న ఓ సినిమాకు సంబంధించి ఇదే మాట వినిపిస్తోంది. సమాజంలో చర్చని లేవనెత్తే సినిమా ఇది. ఎంతగా చర్చ జరిగితే మా సినిమాకి అంత మంచిది. ట్రైలర్ విడుదలైన వెంటనే మా సినిమాపై చర్చ మొదలైంది. అది మంచిదే. ఒక రకంగా ట్రైలర్‌తో మేం ప్రేక్షకుల్ని ముందుగానే సిద్ధం చేశాం అని హీరో ఆ సినిమా గురించి ఇటీవల మాట్లాడారు. ఈ మాటల వెనుక అర్థం డిస్కషన్ ఆ తర్వాత ఫుట్‌ఫాల్స్ అని అర్థమవుతోంది. ఇక ఆ సినిమా నిర్మాత అయితే.. సినిమాలో ప్రేక్షకులు ఊహించని విషయాలు, షాకులు మరిన్ని ఉంటాయనేలా మాట్లాడారు. ప్రేక్షకులను ముందే ప్రిపేర్ చేసే ప్రయత్నం ఇది అనిపిస్తోంది. ఈ సినిమాకు రెగ్యులర్ సినిమాల తరహా ముగింపు ఉండదని చెప్పిన నిర్మాత.. సినిమా ఉన్నట్లుండి, ఆగిపోయినట్లు అనిపిస్తుందని, ప్రేక్షకులు అనుకున్నట్లుగా క్లైమాక్స్ ఉండదని చెప్పారు. అలాగే కాస్త 'అతి' డైలాగ్‌లు అనిపించుకున్నవి సినిమాలో ఇంకా బాగుంటాయి అని కూడా చెప్పారు. ఈ సినిమాలోని సీన్స్, మాటలు ఇప్పటివరకు ఎక్కడా చూసి ఉండరని.. అంత సహజంగా తీశారని కూడా ఆ నిర్మాత చెబుతున్నారు. ఇదంతా చూస్తుంటే సినిమా విడుదల తర్వాత 'బేబీ' తరహా చర్చ, రచ్చ అయితే పక్కా అనిపిస్తోంది. మరి ఏమవుతుందో చూడాలి.

# ఎమోషనల్ థ్రిల్లర్‌గా అలరించనున్న 'మిస్సింగ్ మేఘన'.. ఈ నెల 18న గ్రాండ్ రిలీజ్




సస్పెన్స్ మరియు ఎమోషనల్ డ్రామాలతో ప్రేక్షకులను కట్టిపడేసేందుకు మరో వైవిధ్యమైన చిత్రం వెండితెరపైకి వచ్చేందుకు సిద్ధమవుతోంది. రామ్ కార్తీక్, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'మిస్సింగ్ మేఘన'. ఫస్ట్ కాపీ మూవీస్ మరియు కేడి ఀ కో బ్యానర్లపై పంచుమర్తి నరేష్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి వాచస్పతి దర్శకత్వం వహించారు. ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చి సంచలనం సృష్టించేందుకు వస్తున్న ఈ సినిమాను సెప్టెంబర్ 18న సుమారు 150 థియేటర్లలో అత్యంత గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.గోపరాజు రమణ, వెంప కాశి, కౌశిక్, మహిపాల్, రుచిత, నళిని, శ్రీనివాస్, అజీమ్, పండు తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంపై ఇండస్ట్రీలో మంచి అంచనాలున్నాయి. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి విడుదలైన ప్రచార చిత్రాలు మరియు మూడు పాటలకు ప్రేక్షకుల నుంచి అపూర్వ స్పందన లభించింది. ముఖ్యంగా డిజిటల్ మీడియాలో ఈ సాంగ్స్ తెగ వైరల్ అవుతుండటంతో సినిమాపై బజ్ క్రియేట్ అయింది. ఆర్.ఆర్. ధృవన్ అందించిన సంగీతం ఎంతో ఫ్రెష్ ఫీలింగ్‌ను ఇస్తోందని, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ శ్యామ్. కె. నాయుడు కెమెరా పనితనం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్తుందని సినీ వర్గాలు ప్రశంసిస్తున్నాయి. ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి. వినాయక్ విడుదల చేయగా, మొదటి పాటను లెజెండరీ ప్రొడ్యూసర్ సురేష్ బాబు, రెండో పాటను స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు, మూడవ పాటను ప్రముఖ రచయిత కోన వెంకట్ మరియు మచ్చ రవి లాంచ్ చేయడం విశేషం.ఈ సినిమా గురించి దర్శకుడు వాచస్పతి మాట్లాడుతూ, ఇది కేవలం సాధారణ థ్రిల్లర్ కాదని, క్లైమాక్స్ లో వచ్చే హుక్ పాయింట్ చూసి ప్రేక్షకులు షాక్ అవుతారని తెలిపారు. రెండేళ్ల కష్టంతో, బలమైన కంటెంట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, అందుకే ఒక ప్రముఖ నిర్మాణ సంస్థ ముందుకు వచ్చి సినిమాను రిలీజ్ చేస్తుందని నిర్మాత నరేష్ బాబు సంతోషం వ్యక్తం చేశారు. త్వరలోనే ట్రైలర్‌ను కూడా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది.ఈ చిత్రానికి కో-ప్రొడ్యూసర్‌గా దివెళా శ్రీనివాస్ రావ్ వ్యవహరిస్తుండగా, కథ ఀ స్క్రీన్‌ప్లే వనరాజ్ అందించారు. సంభాషణలు వెంకట్ బద్దిగం సమకూర్చగా, ఎడిటర్ గా బసవా పనిచేశారు. కొరియోగ్రాఫర్లుగా జేడీ, ఈశ్వర్ పెంటి, ఫైట్ మాస్టర్లుగా రామకృష్ణ, స్టంట్ శంకర్ వ్యవహరించారు. లిరిక్స్ ఆర్.ఆర్. ధృవన్, అలరాజు అందించగా, అడిషనల్ స్క్రీన్ ప్లే శ్రీధర్ పరిగి పర్యవేక్షించారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్లుగా మద్దినేని హరి కృష్ణ, కిషోర్ తోకల వ్యవహరించగా, పిఆర్వోలుగా సోమిశెట్టి నాగేశ్వర రావ్ (ఞచీ=), తిరుమలశెట్టి వెంకటేష్ బాధ్యతలు నిర్వర్తించారు.

# 'సర్దార్ 2'కు బిగ్ షాక్.. ఖాళీగా థియేటర్లు, ఏకంగా షోలు కూడా రద్దు




తమిళ స్టార్ హీరో కార్తీ, దర్శకుడు పి.ఎస్. మిత్రన్ కాంబినేషన్‌పై ఉన్న అంచనాలు 'సర్దార్ 2' విషయంలో వర్కౌట్ కాలేదనే టాక్ వినిపిస్తోంది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'సర్దార్' మంచి విజయాన్ని అందుకోవడంతో.దానికి సీక్వెల్‌గా తెరకెక్కిన ఈ చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా కార్తీకి తెలుగులోనూ మంచి మార్కెట్ ఉండటంతో రెండు రాష్ట్రాల్లోనూ సినిమాకు మంచి స్పందన వస్తుందని భావించారు.అయితే థియేటర్లలోకి వచ్చిన తర్వాత పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోందని ట్రేడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మొదటి రోజు నుంచే ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడంలో 'సర్దార్ 2' విఫలమైందనే వార్తలు వస్తున్నాయి.తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రధాన నగరాలు, పట్టణాల్లో 'సర్దార్ 2' ఆక్యుపెన్సీ చాలా తక్కువగా నమోదవుతోంది.ముఖ్యంగా ఉదయం, మధ్యాహ్నం ఆటలకు ప్రేక్షకుల సంఖ్య మరింత తక్కువగా ఉండటంతో కొన్ని మల్టీప్లెక్స్ స్క్రీన్లలో పరిస్థితి ఆందోళనకరంగా మారినట్లు తెలుస్తోంది. కొన్ని చోట్ల టికెట్ బుకింగ్స్ కనీస స్థాయికి కూడా చేరకపోవడంతో షోలు రద్దు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. సాధారణంగా స్టార్ హీరో సినిమా విడుదలైన తొలి రోజుల్లో మల్టీప్లెక్స్‌లలో ముందస్తు బుకింగ్స్‌తోనే మంచి సందడి కనిపిస్తుంది. కానీ 'సర్దార్ 2' విషయంలో మాత్రం అలాంటి పరిస్థితి కనిపించకపోవడం కార్తీ అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. సర్దార్ 2' విడుదలకు ముందు నుంచే అడ్వాన్స్ బుకింగ్స్ ఆశించిన స్థాయిలో లేవనే వార్తలు వచ్చాయి. సీక్వెల్ కావడంతో మొదటి భాగం విజయాన్ని బేస్ చేసుకుని భారీ ఓపెనింగ్స్ వస్తాయని భావించినా.. బుకింగ్స్‌లో మాత్రం పెద్దగా ఊపు కనిపించలేదని సమాచారం.కార్తీకి తెలుగులో ఉన్న క్రేజ్ కూడా ఈ సినిమాకు పూర్తిస్థాయి ఓపెనింగ్స్ తీసుకురాలేకపోయిందనే చర్చ జరుగుతోంది. విడుదల తర్వాత వచ్చిన మిశ్రమ స్పందన దీనిపై మరింత ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. 'సర్దార్ 2'పై వస్తున్న ప్రధాన విమర్శల్లో సినిమా నిడివి కూడా ఒకటిగా మారింది. దాదాపు మూడు గంటల నిడివి ఉండటం, ముఖ్యంగా ద్వితీయార్థంలో కథనం నెమ్మదించడం ప్రేక్షకులకు కనెక్ట్ కాలేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

# అతన్ని ప్రేమించి మోసపోయా



విలక్షణ నటిగా గుర్తింపు తెచ్చుకుని దక్షిణాదిలోని అన్ని భాషల్లో సత్తా చాటుతున్నారు ఐశ్వర్య లక్ష్మీ. నటనే కాదు ఏ విషయంపై అయినా కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడటం ఆమె స్టైల్. ఎవరు ఏమనుకున్నా సరే తన మనసులో ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతారు ఐశ్వర్య. కొద్దిరోజుల క్రితం పెళ్లి, సహజీవనం విషయంలో ఆమె మాట్లాడిన మాటలు హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా రిలేషన్‌పై ఐశ్వర్య చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. కేరళకు చెందిన ఐశ్వర్య లక్ష్మీ.. మెడిసిన్ చదువుకున్నారు. అయితే డాక్టర్ కాకుండా యాక్టింగ్ వైపు వచ్చారు. అప్పటికే మోడలింగ్ చేస్తూ పలు టాప్ బ్రాండ్స్‌కు సంబంధించిన వాణిజ్య ప్రకటనల్లో నటించారు. 2017లో నవిన్ పౌలే సరసన నటించే అవకాశం ఐశ్వర్యకు దక్కింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి గుర్తింపు రావడంతో పాటు మలయాళ, తమిళ భాషల్లో అనూహ్యంగా బిజీ అయ్యారు. మాయానంది, వారాతన్, పొన్నియన్ సెల్వన్, అమ్ము, కుమారి, గట్టా కుస్తీ, హలో మమ్మీ, మామన్ సినిమాలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. సత్యదేవ్ హీరోగా వచ్చిన గాడ్సే మూవీ ద్వారా తెలుగు వారిని పలకరించారు ఐశ్వర్య లక్ష్మీ. ఈ ఏడాది తమిళంలో గట్టా కుస్తీ 2 సినిమాతో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం సాయిధరమ్ తేజ్ సరసన సంబరాల ఏటి గట్టు, మలయాళంలో ఆశా సినిమాలలో ఆమె నటిస్తున్నారు. సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే ఐశ్వర్య.. తన సినిమాలు, షూటింగ్స్, ఇతర వ్యక్తిగత వివరాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. 35 ఏళ్లు దాటి 40వైపు చేరుకుంటున్నా ఇంకా పెళ్లి చేసుకోకుండా బ్యాచిలర్‌గానే ఎంజాయ్ చేస్తున్నారు ఈ ముద్దుగుమ్మ. పలుమార్లు ఐశ్వర్య లక్ష్మీ ప్రేమలో పడినట్లుగా రూమర్స్ రాగా.. వాటిని ఆమె ఖండించారు. నేను సింగిల్‌గా చాలా హ్యాపీగా ఉన్నాను.. నన్ను డబుల్ చేసేందుకు ప్రయత్నించొద్దని ఫ్యాన్స్‌పై విరుచుకుపడింది ఐశ్వర్య. జీవితంలో నేను పెళ్లి చేసుకోను.. ఎంతోమంది సన్నిహితులను చాలా దగ్గరి నుంచి చూశా. పెళ్లి కారణంగా కలల్ని చంపుకుని, వ్యక్తిగతంగానూ వారు ఎదగలేకపోతున్నారు. ఇవన్నీ చూసి, ఆలోచించి జీవితంలో పెళ్లి చేసుకోకూడదని నిర్ణయించుకున్నాను. సంతోషకరమైన జీవితాన్ని గడపటానికి పెళ్లి అనేది తప్పనిసరి కాదు. పెళ్లి చేసుకుని విడిపోవడం కంటే, సహజీవనం బెస్ట్ అని ఐశ్వర్య లక్ష్మీ బోల్డ్ కామెంట్స్ చేశారు. తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పెళ్లి, ప్రేమపై ఐశ్వర్య లక్ష్మీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నేను గతంలో ఓ రిలేషన్‌లో మోసపోయా, స్వతహాగా నేను ఆకర్షణలకు లొంగను, అలాంటి ఓ వ్యక్తిని పూర్తి నమ్మి అతని చేతిలో మోసపోయా. ఈ రిలేషన్ ముగిసిన తర్వాతే నా చుట్టూ ఏం జరుగుతుందో తెలుస్తోంది. ఓ మహిళ నన్ను కలిసిన తర్వాతే అతని మోసం బయటపడింది. ఇందులో తన తప్పు లేకపోవడం వల్లే ఆమెపై నాకెలాంటి కోపం రాలేదు. ఈ విషయం గురించి రెండు రోజులు మాత్రమే బాధపడ్డా.. ఆ తర్వాత దానిని మరిచిపోయానని ఐశ్వర్య లక్ష్మీ పేర్కొన్నారు.

# సేనాపతి వచ్చేస్తున్నాడు.. మళ్లీ తెరపైకి కమల్ హాసన్ ఇండియన్ 3

కమల్‌హాసన్ కెరీర్‌లో ల్యాండ్ మార్క్ మూవీగా నిలిచింది భారతీయుడు. ఈ చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కింది ఇండియన్ 2. శంకర్ డైరెక్షన్‌లో పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా తెరకెక్కిన ఈ మూవీ 2024 జులై 12న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్‌గా రిలీజైన ఇండియన్ 2 బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఢీలా పడిపోయింది. దీంతో ఈ ఫ్రాంఛైజీలో రాబోతున్న ఇండియన్ 3పై ఇక అటకెక్కినట్టేనని వార్తలు వచ్చాయి.ఇండియన్ 2తోపాటు ఇండియన్ 3కు సంబంధించి మేజర్ పార్ట్ షూటింగ్ పూర్తిచేసినట్టు ఇప్పటికే శంకర్ టీం వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే ఇండియన్ 3 థియేటర్‌లో విడుదల కాదని.. ఓటీటీలో మాత్రమే రిలీజ్ అవుతుందంటూ వార్తలు కూడా వచ్చాయి. ఇంతకీ శంకర్-కమల్ హాసన్ ప్రాజెక్టు ఇక లేనట్టేనా..? అని డైలామాలో పడిపోయిన అభిమానులు, మూవీ లవర్స్ కోసం ఆసక్తికర వార్త బయటకు వచ్చింది.కొన్ని మైనర్ ప్యాచ్ వర్క్, కంప్యూటర్ గ్రాఫిక్స్ వర్క్ మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్టు ఇన్‌సైడ్ టాక్. చెన్నై సర్కిల్ కథనాల ప్రకారం మేకర్స్ త్వరలోనే పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు మొదలుపెట్టనున్నారట. కమల్ హాసన్ సేనాపతిగా మరోసారి సందడి చేయనుండగా.. శంకర్ తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ కాబోతున్నాడు. ఎప్పుడు రీస్టార్ట్ అవుతుందనే దానిపై అధికారిక అప్‌డేట్ లేనప్పటికీ మేకర్స్ మాత్రం వీలైనంత త్వరలో ఇండియన్ 3ను పూర్తి చేసి విడుదల చేయాలనిప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఇదే నిజమైతే శంకర్ భారతీయుడు మేనియాను మరోసారి సిల్వర్ స్క్రీన్‌పై ఆవిష్కరిస్తాడా..? అనేది చూడాలి.ఇండియన్ 2లో ఎస్‌జే సూర్య, బాబీ సింహా, సిద్దార్థ్, సముద్రఖని, లెజెండరీ కమెడియన్ బ్రహ్మానందం, మధుబాల, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, కీలక పాత్రల్లో నటించారు. మరి ఇండియన్ 3లో మరి కొత్త యాక్టర్లెవరైనా జాయిన్ అయ్యారనేది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma